26-10Pg1exHMNWJQEC.qxd:26-10Pg1exHMNWJQEC.qxd 1/1/02 6:36 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విశాఖపట్నం
fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 266 పేజీలు: 16 వెల: 6.50

**కన్నడిగులకు ఉద్యోగాలివ్వండి**
ఐటి సంస్థలకు సిఎం డికె వార్నింగ్

**మన క్షిపణులు భళా!**
ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎపి సింగ్
5లో

# 'అర్నబ్' ముప్పు



- మరింత బలపడిన తీవ్ర వాయుగుండం
- కాకినాడ-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 140 కి.మీ వేగంతో గాలులు వీచే సూచనలు
- భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే చాన్స్
- ఉభయ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక
- వాతావరణ శాఖ హైఅలర్ట్ జారీ

**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి పెను ముప్పులా మారుతోంది. ఇది రాబోయే సమయంలో 'అర్నబ్' అతి తీవ్ర తుఫాన్‌గా మారనుందని వాతావరణశాఖ (ఐఎండి) హెచ్చరించింది. ఇది ప్రస్తుతం విశాఖకు 880 కిలో మీటర్లు, కాకినాడకు 980 కిలోమీటర్లు, మచిలీ పట్నానికి 1080 కిలోమీటర్లు, బాపట్లకు 1150 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమైంది. గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో ముందుకు కదులుతోందని వాతావరణశాఖ పేర్కొంది. తీవ్ర వాయుగుండం సోమవారానికి తుపానుగా బలపడుతుందని వెల్లడించింది.

ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరంచెంది అదే రోజు మధ్యాహ్నానికి బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ హైఅలర్ట్ ప్రకటించారు. విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అంచనా ప్రకారం, ఈ తుఫాన్ కాకినాడ - నర్సాపురం మధ్య కోనసీమ ప్రాంతం గుండా తీరం దాటేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు దాదాపు 140 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రచండ గాలులు విరుచుకుపడే అవకాశం ఉందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది.

ఈ తుఫాన్ తీవ్రత కారణంగా కోస్తాంధ్ర వ్యాప్తంగా కుంభవర్షాలు కురిసే ప్రమాదముంది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 20 సెంట మీటర్లకు పైగా భారీనుంచి అత్యంత భారీవర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో లోతట్టు >>2

## పురపాలికల్లో కూటమి ప్రభంజనం

# ఏకగ్రీవాలు





**పలు కార్పొరేషన్లు సహా మున్సిపాలిటీలు కైవసం**
**నగర పంచాయతీల్లోనూ కూటమిదే ఆధిపత్యం**
**రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోనే అత్యధికం**
**24యేళ్లకే రాజంపేట చైర్‌పర్సన్‌గా గాయత్రి రికార్డు**

**విజయవాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పలు మున్సిపాలిటీల్లో టిడిపి, జనసేన,బిజెపి కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవమైన అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి డిక్లరేషన్ అందుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీని టిడిపికి కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా నంద్యాల రాఘవరెడ్డితో పాటు తెలుగుదేశానికి చెందిన 52 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారందరికీ మున్సిపల్ కార్యాలయంలో డిక్లరేషన్లు ఇచ్చారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పట్టుదలతో పనిచేస్తామని ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న రాఘవరెడ్డి తెలిపారు. పల్నాడుజిల్లా దాచేపల్లి నగర పంచాయతీ ఛైర్మన్‌గా టిడిపి అభ్యర్థి తంగేళ్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాచేపల్లిలో ఛైర్మన్‌తో పాటు 28వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. గురజాల నగర పంచాయతీ ఛైర్మన్‌గా తెలుగుదేశానికి చెందిన నేలవల్లి బొల్లయ్యతో పాటు 23 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవంగా గెలుపొందారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీపై కూడా టిడిపి జెండా ఎగిరింది. తెలుగుదేశానికి చెందిన బాబావలి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. చిలకలూరిపేట 48 వార్డుల్లో 16 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవం కాగా పురపాలక ఛైర్‌పర్సన్ బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు.ప్రకాశం జిల్లా దర్శి మున్సిపాలిటీ జనసేన కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దారం సుబ్బారావుతో పాటు 28వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనిగిరి మున్సిపాలిటీపై టిడిపి జెండా ఎగిరింది. ఛైర్ పర్సన్‌గా తిరుపతమ్మతో పాటు 30 మంది కౌన్సిలర్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మున్సిపాలిటీలో 48 వార్డులకు 30 వార్డుల్లో టిడిపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 37వ వార్డు కౌన్సిలర్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఆత్మకూరు మున్సిపాలిటీని టిడిపి కైవసం >>2

# బి అలర్ట్!

- అనుక్షణం అప్రమత్తంగా ఉండండి
- ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోండి
- జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా పనిచేయాలి
- జిల్లాల కలెక్టర్లతో సిఎం చంద్రబాబు సమీక్ష

2లో



ఆదివారం సచివాలయంలో అర్నబ్ తుఫాన్‌పై అధికారులతో సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

# పరిషత్ పోరులో నిలిచింది వీరే

**9,829 ఎంపిటిసి స్థానాలకు 46,457 మంది అభ్యర్థులు**
**659 జడ్పిటిసి స్థానాలకు 4,770 మంది పోటీ**

**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అత్యంత ఉత్కంఠ రేపుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోంది. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ఘట్టం ముగిసింది. అప్పీళ్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్ర ఎన్నికలసంఘం అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి భారీ సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,829 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, పరిశీలన అనంతరం మొత్తం 46,457 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. ఇక పరిషత్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన జడ్పిటిసి స్థానాల విషయానికి వస్తే.. మొత్తం 659జడ్పిటిసి స్థానాలకుగాను 4,770 మంది అభ్యర్థులు తుదిపోరులో >>2



# 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమం కీలకం

**స్వదేశీ ఉత్పత్తులనే ఆదరించాలని 'మన్ కి బాత్'లో ప్రధాని**
**చిరుధాన్యాలను ఆహారంలో చేర్చాలని హితవు**



న్యూఢిల్లీ, అక్టోబరు 25: భారతీయ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు పరిచయం చేయడంలో 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. పండుగల సీజన్‌లో ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా రైతులు, చేతివృత్తులవారు, చిన్న వ్యాపారులకు మద్దతు ఇవ్వవచ్చని సూచించారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనను ఆచరణలో పెట్టడం ద్వారా భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావచ్చని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, స్థానిక కళాకారులు, రైతులు, సంప్రదాయ వృత్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ పత్తి సాగు, గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్, స్వచ్ఛత కార్యక్రమాలు, సహజ జలవనరుల పునరుద్ధరణ వంటి అంశాలను ప్రధాని ప్రస్తావించారు. పండుగల సమయంలో ప్రజలు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు స్వదేశీ ఉత్పత్తులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని మోడీ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని గిరిజన సమాజాలు తమ ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయని ప్రధాని మోడీ ప్రశంసించారు. 'శబరి నేచురల్స్' ద్వారా తేనె, మహువా, పైన్, వెదురు వంటి సహజవనరులతో తయారుచేసిన ఉత్పత్తులను >>2





స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో లక్షలాదిమంది రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్న సామాన్యులు

# యూరప్.. అగ్నిగుండం

*యూరప్ వ్యాప్తంగా సామాన్యుల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. పెరిగిన జీవన వ్యయం, అందుబాటులో లేని నివాస గృహాలు, చాలీచాలని వేతనాలు, క్షీణిస్తున్న ప్రభుత్వ సేవలు, ప్రభుత్వాల విధానాలపై ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తి వరుసగా రెండో వారాంతంలో కూడా అనేక దేశాలను కంపింపజేసింది. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆల్బేనియా, బెల్జియం వంటి దేశాల్లో లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. అనేక ప్రాంతాల్లో ఈ ఆందోళనలు శాంతియుతంగా ప్రారంభమైనప్పటికీ, క్రమంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు, దాడులు, లూటీలు, వీధి పోరాటాలుగా మారడంతో యూరప్ దేశాలు తీవ్ర భద్రతా దళాల దిగ్బంధంలోకి వెళ్ళవలసి వచ్చింది. ఫ్రాన్స్‌లో ఈ అసంతృప్తి అత్యంత తీవ్ర రూపం దాల్చింది.*

**సామాన్యుల ఆగ్రహజ్వాలలు**
**ఫ్రాన్స్, ఇటలీ, అల్బేనియా, స్పెయిన్, పోర్చుగల్‌లో రోడ్లెక్కిన ప్రజలు**
**లక్షలాది మందితో నిరసనలు, రంగంలోకి భద్రతా దళాలు**
2లో

# రక్షణ రంగంలో ఎపికి బిగ్ బూస్ట్

**రూ. 2500 కోట్లతో బిఇఎల్ ప్రాజెక్టు: మంత్రి నారా లోకేష్**

**అమరావతి,అక్టోబరు25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రక్షణ రంగ తయారీకి సంబంధించిన పరిశ్రమల అభివృద్ధికి కీలక ముందడుగు పడుతోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. కేంద్ర ప్రభుత్వ రంగంలోని నవరత్న కంపెనీ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్), ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి రక్షణ రంగానికి సంబంధించిన వ్యవస్థను నిర్మించడానికి శ్రీసత్యసాయి జిల్లాలో 914 ఎకరాలవిస్తీర్ణంలో రూ.2,500 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనివల్ల మనయువతకు హైటెక్ డిఫెన్స్ తయారీ రంగాలు, 800 నాణ్యమైన ఉద్యోగాలు లభించడంతో పాటు రాయలసీమలో సరఫరాదారుల వ్యవస్థకూడా పెరుగుతుంది.

# సముద్ర వాణిజ్యంలో ఎపి రికార్డు

**రాష్ట్రంలోని పోర్టుల ద్వారా 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా**
**దేశంలో రెండో స్థానం... కార్గో సామర్థ్యంలో గుజరాత్ టాప్-1**
**డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ వెల్లడి**
**2026-27నాటికి పోర్టుల సామర్థ్యం 285 ఎంఎంటిలకు పెంపు లక్ష్యం**



**విజయవాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి పోర్టులు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాయి. టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, వసతులు మెరుగుపడటంతో గత యేడాదితో పోలిస్తే సరకు రవాణాలో 12 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులు పూర్తయితే మరో 109 ఎంఎంటిల సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వస్తుంది. ఈ లక్ష్యాలు నెరవేరితే నాన్‌మేజర్ పోర్టుల సరకు రవాణాలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దాటేయడం ఖాయంగా కనిపిస్తోంది. సముద్రవాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. 2025-26 సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటి) సరకురవాణా జరగడంతో రాష్ట్రం >>2

# స్థానిక పోరు: కూటమిలో లోకేష్ మంత్రాంగం



**సమన్వయం నుంచి క్షేత్రస్థాయి వ్యూహం వరకు**
**విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులకు దిశానిర్దేశం**
**లోకేష్ రాజకీయ చతురతపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ**

**విజయవాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని విజయదిశలో నడిపేందుకు టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కీలక మంత్రాంగం నెరుపుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో కూటమిలోని మిగతా పక్షాలతో సమన్వయం చేసుకుంటూనే క్షేత్ర స్థాయిలో పార్టీకి దిశానిర్దేశం చేస్తున్నారు. నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ వ్యవహారాల్లో బిజీగా ఉంటుండగా లోకేష్ పార్టీ వ్యవహారాలను చక్కబెడుతున్నారు. పార్టీ నాయకులతో నిరంతర సంబంధాలను కొనసాగిస్తూ పవన్‌తోపాటుజనసేన ద్వితీయ స్థాయి నాయకత్వంతోనూ ఆయన సంబంధాలను కొనసాగిస్తున్నారు.

**పార్టీ శ్రేణులతో అనుసంధానం.. మిత్రపక్షాలతో సమన్వయం:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి అధికార కూటమికి కీలక పరీక్షగా మారడంతో ఈ పరిస్థితి అనివార్యమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని స్థానిక రాజకీయాల్లోనూ ప్రతిబింబింపజేయడం అధికార పక్షాలకు ఒక లక్ష్యంకాగా, గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసుకోవడం మరో అవసరం. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ పాత్రపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వపరిపాలన, కూటమి నాయకత్వ బాధ్యతలను నిర్వహిస్తుండగా, పార్టీ వ్యవహారాల్లో లోకేశ్ చురుకుగా వ్యవహరిస్తున్నారన్నది తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే కనిపించే అంశం. పార్టీ నాయ కులతో నిరంతర సంబంధాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమాచారం, జనసేనతో పాటు బిజెపితో సమన్వయం వంటి >>2



# 1న జరిగే 'రామ్‌లీలా' ర్యాలీకి 10లక్షల మంది

**కాంగ్రెస్ పార్టీ అంచనా**
5లో

**సర్ రద్దు, సిఐసి తొలగింపు డిమాండ్లతో నిరసనలు**

26-10Pg3exHMNWJQE.qxd:26-10Pg3exHMNWJQE.qxd 1/1/02 6:34 AM Page 1



## విద్యుత్ సమస్యలుంటే 1912కు ఫోన్ చేయండి

• మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్నబ్ తుఫాన్ వలన విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణం 1912 నంబర్‌కు ప్రజలు సమాచారం అందించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖను అప్రమత్తం చేశారు. డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే.. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రులు సూచించారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇతర శాఖలతో విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. 25 వేల స్తంభాలను, ఇతర సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేసినట్లు అధికారులు, మంత్రులకు వెల్లడించారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాలకు అదనపు సిబ్బందిని పంపేందుకు ఎస్‌పిడిసిఎల్ సన్నద్ధం కావాలని ఆదేశించారు. తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. కిందపడిన కరెంట్ వైర్లు, స్తంభాల దగ్గర ప్రజలు జాగ్రత్త వహించాలని మార్గనిర్దేశం చేశారు.

# డెల్టా రైతుల గుండెల్లో 'అర్నబ్' అలజడి

• 50 శాతం వరి కోతకు సిద్ధం • కోస్తాకు తుఫాను ముప్పు హెచ్చరిక • ధాన్యం చేతికందే వేళ ప్రకృతి ప్రకోపం • బియ్యం ధరలు మరింత పెరిగే ఆందోళన

**నరసాపురం, అక్టోబరు 25 ప్రభాతవార్త:** డెల్టా ప్రాంతంలో సార్వా వరి పంట చివరి దశకు చేరుకోవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్న వేళ 'అర్నబ్' తుఫాను హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఎగువ ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు పశ్చిమ డెల్టాపై తుఫాను ప్రభావం ఉండవచ్చన్న హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. చేతికందాల్సిన పంట ప్రకృతి ప్రకోపానికి బలవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వరదలు, ఒకట్రెండు తుఫాన్ల ప్రభావాన్ని తట్టుకుని సార్వా పంట చివరి దశకు చేరుకుంది. ఎకరాకు 42 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తుందని, ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తుండటంతో కొంత లాభం మిగులుతుందని రైతులు ఆశించారు. అయితే తుఫాను హెచ్చరికలు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. మచిలీపట్నం, కాకినాడ ప్రాంతాలకు సమీపంలో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందని, రానున్న రెండు రోజుల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ హెచ్చరికలు వెలువడినట్లు సమాచారం.

**ఐదు లక్షల ఎకరాల్లో పంట.. రైతుల్లో ఆందోళన:** డెల్టా ప్రాంతంలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, దాదాపు పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో సుమారు 50 శాతం పంట కోతకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వాతావరణం అనుకూలిస్తే నవంబర్ నాటికి 50 నుంచి 60 శాతం ధాన్యం మిల్లులకు చేరే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. ఈ తరుణంలో తుఫాను ముప్పు ఎదురవడం వారిని కలవరపెడుతోంది. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, గోస్తనీ, తమ్మిలేరు ప్రభావంతో తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో వరి పంట ముంపునకు గురై రైతులు నష్టపోయారు. ఇప్పుడు మరోసారి భారీ వర్షాలు కురిస్తే డెల్టా అంతటా పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ధాన్యం కొనుగోళ్లకు అధికారుల సన్నాహాలు:** పంట కోతల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. అయితే తుఫాను ప్రభావంతో కోతలు ఆలస్యమైతే, ధాన్యం తడిసిపోతే కొనుగోళ్లు, నిల్వల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. పంటను సురక్షితంగా ఇళ్లకు, కల్లాలకు చేర్చుకునేందుకు రైతులు వాతావరణ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు.

**బియ్యం ధరలు మరింత పెరిగేనా?:** ప్రస్తుతం సన్నబియ్యం కిలో రూ.90 నుంచి రూ.100 వరకు,



ఇతర రకాల బియ్యం రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు బియ్యం కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాను కారణంగా వరి పంట దెబ్బతింటే ధాన్యం సరఫరా తగ్గి బియ్యం ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో దీపావళి సమీపించే సమయంలో వర్షాలు, తుఫాన్ల ప్రభావం ఉంటుందన్న గత అనుభవాలు రైతులను మరింత అప్రమత్తం చేస్తున్నాయి. పండించిన పంట చేతికందే కీలక సమయంలో వాతావరణం సహకరించాలని, ప్రకృతి విపత్తుల నుంచి సార్వా పంటను కాపాడాలని రైతులు ఆశిస్తున్నారు.

## తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

• అధికార యంత్రాంగానికి హోంమంత్రి వంగలపూడి అనిత కీలక ఆదేశాలు



**అమరావతి, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుఫాను ప్రభావంతో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం బాపట్ల–విశాఖపట్నం తీరాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని, అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలి:** తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు:** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి సూచించారు. బీచ్‌లలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ఇతర ప్రమాదకరకార్యకలాపాలకు పాల్పడటం వంటివి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వదంతులను నమ్మొద్దు.. అధికారిక హెచ్చరికలను పాటించాలి:** తుఫాను ప్రభావం దృష్ట్యా రైతులు, ప్రజలు తమ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) జారీ చేసే అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తిరుమలలో దంచికొడుతున్న వానలు



**తిరుమల, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను అతి తీవ్ర తుపానుగా మారడంతో గత మూడురోజులుగా తిరుపతి జిల్లాలో అనేక ప్రాంతాలతోబాటు తిరుమలకొండపై వానలు దంచికొడుతున్నాయి. ఆదివారం ఉదయం నుండి కొండపై కొంతసమయం తెరపిచ్చినా ఆ తరువాత 11గంటల నుండి మళ్ళీ వరుణదేవుడు చల్లనిచూపుతో తిరుమలలో జోరువాన కురిసింది. ఆర్నబ్ తుఫాన్‌తో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆలయం పరిసరాలు, కొండపై చాలాప్రాంతాలు వర్షపునీటితో సందడిగా మారింది. ఉదయం కురిసిన జోరువానతో ఆలయంలోపలకు వెళ్ళే భక్తులతోబాటు దర్శనానంతరం ఆలయం వెలుపల వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. ఆదివారం ఉదయం నుండి తిరుమలకొండపై పూర్తిగా వాతావరణం మారిపోయింది. చలిగాలులు వీస్తున్నాయి. ఆదివారం సాయంత్రం కూడా జోరున వర్షం కురుస్తూనే ఉంది. మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శేషాచలం కొండల్లోని ఐదు ప్రధానజలాశయాలు వరదనీరు మొస్తరుగా చేరుతోంది. ఈ వర్షాలకు తిరుమలలోని గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ, పాపవినాశనమ్, కుమారధార, పసుపుధార తీర్థాలు ప్రధాన జలాశయాలకు వరదనీరు వచ్చిచేరుతోంది. గత రెండురోజులుగా తిరుమలలో 8సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. తిరుమల అవసరాలకు అదనంగా మరో వారంరోజులు వరకు సరిపడే నీరుచేరింది. తిరుమలలో భారీ వర్షం కురుస్తుండటంతో భక్తులేగాక టిటిడి అధికారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పుతో చల్లటిగాలులు వీచి జోరువాన అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం మొదలైన వాన రాత్రి కూడా చిరుజల్లులు పడుతూనే ఉంది. కురిసిన వరదనీటికి ఆలయం పరిసరాలు, ఘాట్‌రోడ్లు జలమయంగా మారాయి. కొండను పూర్తిగా పొగమంచు కప్పేసింది. మంచుతో తిరుమలను, ఘాట్‌రోడ్లను కప్పేయడంతో వాహనాలు, భక్తులు దగ్గరగా వస్తేగానీ కనిపించేపరిస్థితి లేదు. చిన్నపిల్లలు, వృద్ధులు గదుల నుండి బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

**మొదటి ఘాట్‌లో గోడను ఢీ కొన్న కారు:** ఓ వైపు భారీ వర్షాలు మరోవైపు పట్టుతప్పిన వాహనం చివరకు తిరుమల మొదటిఘాట్‌లో తమిళనాడు యాత్రికుల కారు గోడను ఢీ కొంది. దీంతో కారులో ఉన్న నలుగురు ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం శ్రీవారి దర్శనం ముగించుకుని



తిరువళ్ళూరు భక్తులు కారులో తిరుమల నుండి తిరుపతికి దిగుతుడగా మొదటి ఘాట్‌లో చివరి మలుపు వద్ద మల్వాడి గుండం వద్ద అదుపుతప్పి కొండను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంతో ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. అసలే చీకటి ఆపై వానతో తడిసిన రోడ్డుపై ఇబ్బందులు పడ్డారు. ఘటనా స్థలానికి విజిలెన్స్ సిబ్బంది చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు.

# మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

**శ్రీకాకుళం, అక్టోబరు 25 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తీరం వైపు దూసుకొస్తోందని, ఇది తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల నుంచి సమాచారం అందిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా ఉన్నతాధికారుల అత్యున్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ తుపాను కాకినాడ–అనకాపల్లి ప్రాంతాల మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, శ్రీకాకుళం జిల్లాలోనూ దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. గత నెలలో కలింగపట్నం, పోలాకి ప్రాంతాల మీదుగా వెళ్లిన తీవ్ర వాయుగుండం కంటే ఇది చాలా బలమైనదని, జిల్లాలో గంటకు 80 నుండి 90 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయడంతో పాటు ఈ నెల 27, 28 తేదీల్లో సుమారు 150 మిల్లీమీటర్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విపత్తు సమయంలో ప్రజలకు సత్వర సహాయం అందించేందుకు జిల్లా కేంద్రంలో ఒకటి, డివిజన్ స్థాయిలో మూడు, మండలాల వారీగా 30 కంట్రోల్ రూమ్‌లను తెరిచామని, గతంలో వినియోగించిన నంబర్లకే ప్రజలు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రేకులతో కట్టిన ఇళ్లు, పూరి గుడిసెలు, తాత్కాలిక నిర్మాణాల్లో నివసించే వారు, అలాగే కొండ ప్రాంతాలు, చెరువులు, రిజర్వాయర్ల పరిసరాల్లో ఉండేవారు తీవ్ర వర్షాలు, వరదల వల్ల ప్రమాదాల బారిన పడకుండా వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాలకు లేదా బంధువుల ఇళ్లలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో అన్ని వసతులతో పాటు పోలీసు బందోబస్తు కూడా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు రాబోయే 3-4 రోజుల పాటు ముందుగానే సమీపంలోని ఆసుపత్రుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకున్నామని, అధికార యంత్రాంగం ఇచ్చే హెచ్చరికలను పాటిస్తూ ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశానికి ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# వైద్య సేవలు నిరంతరం కొనసాగాలి

• తుఫాను హెచ్చరికలకు తగ్గట్లు సత్వరం చర్యలు చేపట్టాలి • జిల్లా అధికారులదే బాధ్యత • ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు • గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు

**విజయవాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తుఫాను ప్రభావం దృష్ట్యా ఈ నెల 27 నుంచి 30 వరకు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక, గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కే.వి.ఎన్. చక్రధర్ బాబు ఆదేశించారు. గర్భిణులు, నవజాత శిశువులు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వైద్య సేవల్లో అంతరాయం కలగకూడదని సూచించారు. ఈ నెల 27న కృష్ణా, బాపట్ల జిల్లాలకు, 28న 13 జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జిల్లా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

**ముందస్తు ఏర్పాట్లు.. నిరంతర పర్యవేక్షణ:** జిల్లాల్లో 24 గంటలూ పనిచేసే అత్యవసర నియంత్రణ గదులు ఏర్పాటు చేయాలి. వరద ముప్పు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందులు, పరికరాలు, విద్యుత్తు, నీటి సదుపాయాలను తనిఖీ చేయాలి. వైద్య సిబ్బందికి విధులు కేటాయించి అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలి. రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖలతో పాటు 108, 104, 102 సేవలతో సమన్వయం చేసుకోవాలి. అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ద్రావణాలు, సెలైన్‌లు, ప్రసూతి మందులు, శిశు సంరక్షణ సామగ్రి, ఆక్సిజన్, జనరేటర్లు, ఇంధనం, తాగునీరు సిద్ధంగా ఉంచాలి. మందులు, టీకాల నిల్వకు అవసరమైన శీతలీకరణ సదుపాయాలను తనిఖీ చేయాలి. వరద నీటితో వైద్య పరికరాలు, రికార్డులు దెబ్బతినకుండా చూడాలి. అత్యవసర రోగుల తరలింపునకు 108 వాహనాలు, రక్తనిధులు, ప్రసూతి కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలి. అనుమతుల కోసం వేచి ఉండి రోగుల తరలింపులో ఆలస్యం చేయకూడదు.

**గర్భిణుల తరలింపునకు చర్యలు:** అక్టోబరు 23 నుంచి నవంబరు 6 మధ్య ప్రసవ తేదీ ఉన్న 26,768 మంది గర్భిణుల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులకు పంపించారు. లోతట్టు, వరద ముప్పు ప్రాంతాల్లోని గర్భిణులతో పాటు హై రిస్క్ గర్భిణులు, తీవ్ర రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు, గతంలో సిజేరియన్ జరిగినవారిని ప్రాధాన్యంగా ఆసుపత్రులకు తరలిస్తున్నారు. రవాణా అంతరాయాలు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందుగానే తరలింపు చేపడుతున్నారు. ఆసుపత్రుల్లో చేర్చుకునేందుకు ఏర్పాట్లు చేసి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర వాహనాలను వినియోగిస్తున్నారు. గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల సిబ్బంది గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, క్రమం తప్పకుండా మందులు వాడేవారి కుటుంబాల వివరాలు సేకరించాలి. ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి.

**తాగునీరు, పారిశుద్ధ్యంపై నిఘా:** ప్రభావిత గ్రామాల్లో తాగునీటి వనరులను పరీక్షించి కలుషిత నీటి వినియోగాన్ని నివారించాలి. ఆసుపత్రులు, సహాయక శిబిరాల్లో పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలి. అతిసారం, జ్వరం, అంటువ్యాధులు, లెప్టోస్పైరోసిస్, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, పాముకాటు, నీట మునిగిన ఘటనలపై నిఘా ఉంచాలి. వ్యాధులు అసాధారణంగా పెరిగినా, ఒకేచోట ఎక్కువ కేసులు నమోదైనా వెంటనే అధికారులకు తెలియ జేయాలి. బాధితులకు ప్రథమ చికిత్స అందించి అవసరమైన వైద్య కేంద్రాలకు తరలించాలి.

**తుఫాను అనంతరం వైద్యసేవల పునరుద్ధరణ:** పరిస్థితులు సురక్షితమైన తర్వాత నిలిచిపోయిన వైద్య పరీక్షలు, ప్రసవాలు, టీకాలు, ప్రయోగశాల సేవలు, మందుల పంపిణీని పునరుద్ధరించాలి. తాగునీటి భద్రత, పారిశుద్ధ్యం, వ్యాధుల ముప్పును పరిశీలించాలి. తల్లి, శిశు వైద్య పరీక్షలు పూర్తి చేసి మందుల నిల్వలను భర్తీ చేయాలి. దెబ్బతిన్న వైద్య పరికరాలు, సదుపాయాలకు మరమ్మతులు చేపట్టాలి.

**అధికారులదే బాధ్యత:** జిల్లా స్థాయిలో సన్నద్ధత, సమన్వయం, పర్యవేక్షణ బాధ్యత జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులదేనని కమిషనర్ కే.వి.ఎన్. చక్రధర్ బాబు స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సేవలు కొనసాగించేలా చూడాలి. గ్రామస్థాయి సిబ్బంది ప్రమాదంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం, ప్రజలకు హెచ్చరికలు ఇవ్వడం, వ్యాధులపై నిఘా, సమాచార నివేదికల బాధ్యతలు నిర్వహించాలి. ప్రతికూల వాతావరణం ప్రారంభమయ్యేలోపు జిల్లా సన్నద్ధత నివేదిక సమర్పించాలని ఆదేశించారు. బోధన ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులను కూడా అప్రమత్తం చేసినట్లు వైద్య విద్య సంచాలకుడు ఎ. విష్ణువర్ధన్ తెలిపారు.

# విద్యుత్ సంస్థల హైఅలర్ట్

• యుద్ధప్రాతిపదికన ముందస్తు విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టాలి • విద్యుత్ సిబ్బంది సాధారణ సెలవులు రద్దు • అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి • ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర రూపం దాల్చి తుపానుగా మారే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయి అత్యవసర సన్నాహక చర్యలు చేపట్టింది. విద్యుత్ విభాగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేసేందుకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, గ్రిడ్ మౌలిక సదుపాయాలను కాపాడుతూ, ప్రజా భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడమే ధ్యేయంగా అత్యవసర ప్రణాళికలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, అక్టోబరు 26



నుంచి తుపాను ప్రభావం తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రాష్ట్రవ్యాప్తంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎండీలు, డైరెక్టర్లు మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. జోనల్ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, విపత్తు నిర్వహణలో పాల్గొనే కీలక సాంకేతిక సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని కె. విజయానంద్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలకు తావులేకుండా ఉండేందుకు, క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం వాతావరణ నివేదికలు, ఈదురు గాలుల వేగం, ఫీడర్ల స్థితిగతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. "గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడటం, ప్రజల ప్రాణాలను, మౌలిక సదుపాయాలను రక్షించడమే మన ప్రాథమిక బాధ్యత అని, ప్రతి సాంకేతిక బృందం అత్యంత అప్రమత్తతతో పనిచేస్తూ, ప్రతికూల వాతావరణం ముంచుకరాక ముందే సున్నితమైన ప్రాంతాల్లో సిబ్బందిని, అత్యవసర యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని విజయానంద్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపి జెన్కో ఎండి యస్.నాగలక్ష్మి, ఏపి ట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఏపి ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపి ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి, ఏపి సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, డైరెక్టర్లు ఎవికె భాస్కర్, జె.వి.రావు, చీఫ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీ భక్తులు





**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 25 ప్రభాతవార్త:** శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం వేకువజాము నుండి భవానీ దీక్షాధారులు సామాన్య భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దీక్షా విరమణల నిమిత్తం సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన వేలాది మంది భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి క్షేత్రమంతా అరుణవర్ణ శోభితమై జై భవానీ నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుండే అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గ నగర్ వైపు నుండి భక్తులు పోటెత్తడంతో కొండమీద క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని సామాన్య భక్తులకు, భవానీలకు సత్వర దర్శనం కల్పించేందుకు అంతరాలయ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ అమ్మవారికి మహానివేదన సమర్పించిన తర్వాత సాధారణ భక్తుల దర్శనానికి మరింత వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో అన్ని రకాల ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను సైతం రద్దు చేసి క్యూలైన్లలో ఉన్న భక్తులందరికీ పూర్తిగా ఉచిత దర్శనం (సర్వదర్శనం) మాత్రమే అమలు చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా తాగునీరు పంపిణీ జరిగింది.

**దుర్గమ్మ సేవలో న్యాయమూర్తి:** శ్రీ కనకదుర్గమ్మను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ్ శర్మ దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం చేయగా దేవస్థాన అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు ప్రసాదాలు మరియు చిత్రపటాన్ని అందచేశారు.



# డిజిటల్ అరెస్టు పేరిట రిటైర్డ్ ఉద్యోగికి రూ.1.17 కోట్ల టోకరా

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సైబర్ మోసాలు ఆగడం లేదు. ఇటీవలే రిటైర్డ్ అయిన ఓ ఉద్యోగిని లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట కోటీ 17 లక్షల రూపాయలను కాజేశారు. నగరంలోని న్యూ మెట్టుగూడకు చెందిన 71 ఏళ్ల ఆగ్నేస్ ఫ్రాన్సిస్ ఈసీఐఎల్‌లో ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే పదవీ విరమణ పొందారు. గత సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన పోలీస్ అధికారినంటూ ఓ వ్యక్తి ఫ్రాన్సిస్‌కు ఫోన్ చేశాడు. తనను తాను పంచవటి ఠాణా ఎస్సై సంజయ్‌గా పరిచయం చేసుకోవడం, యూనిఫాంలో కనిపించడంతో ఫ్రాన్సిస్ అతడిని నిజమైన పోలీస్ అధికారిగా భావించారు. అనంతరం నిందితుడు విడియో కాల్‌లో మరోవ్యక్తిని ఎన్ఐఏ అధికారిగా పరిచయం చేశాడు. మనీ లాండరింగ్, ఉగ్రవాద కార్యకలాపాలతో మీకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించామంటూ ఫ్రాన్సిస్‌ను ఇద్దరు భయపెట్టారు. ఈడీ ఆ దేశాలంటూ నకిలీ పత్రాలు చూపించి డిజిటల్ అరెస్ట్ చేశామన్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లకూడదని ఆదేశించారు. ఆడిట్ వెరిఫికేషన్ పేరుతో బ్యాంకు నగదు బదిలీ చేయాలంటూ ఫ్రాన్సిస్‌పై ఒత్తిడి తెచ్చారు. కుటుంబానికి హాని జరుగుతుందనే భయంతో ఫ్రాన్సిస్ నగదు బదిలీ చేశారు. బంగారు నగలు సైతం తాకట్టు పెట్టి సెప్టెంబర్ 15 నుంచి 24 వరకు పలు విడతల్లో కోటీ 17 లక్షల రూపాయలను నిందితులు చెప్పిన బ్యాంకుల ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వార్త

ఇతరుల మాటల్ని శ్రద్ధగా వినేవారు
ప్రతిచోటా తమ పలుకుబడిని పెంచుకుంటారు.

- విల్సన్ మైజ్నర్

## పారా హుషార్!

రాబోయే పది నెలల కాలంలో 'ఎల్‌నినో' మనల్ని ఇబ్బందులకు గురిచేస్తుంది 'పారాహుషార్'అంటూ తెలంగాణ పాలకులు ఇప్పుడు ఊరూవాడా అప్రమత్తం చేస్తున్నారు. హఠాత్తుగా మీదపడిన కోవిడ్ గురించి తెలిసోతెలియకో ముందు జాగ్రత్తలు వహించక సొంత వారి ప్రాణాల్నే కాపాడుకోలేకపోయిన అనుభవాలున్న తెలంగాణ ముందస్తుగానే రాబోయే ప్రమాదాల్ని గుర్తించి సకల జనాన్ని అప్రమత్తం చేయడం అభినందించదగిన విషయమే. ఇది పాలకుల ముందుచూపును తెలియ చేస్తోంది. 'ఎల్‌నినో' ఉధృతంగా మారి రాబోయే రోజుల్లో భారతదేశాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్న హెచ్చరికలతో భారత వాతావరణ సంస్థ ఇప్పటికే మేల్కొల్పింది. చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్‌నినోను ఎదుర్కోవాల్సి వస్తుందని దాని ప్రభావాన్ని,అసాధారణ ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం విలవిల్లాడిపోతుంటారని వారి హెచ్చరికల సారాంశం. ఈ యేడాది నవంబరు నుంచి 2027 జనవరి మధ్యకాలంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటుకన్నా 3.8డిగ్రీలసెల్సియస్ వరకు పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఈసారి వర్షాకాలంలో తెలంగాణలో దాదాపు 20 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. దాని ప్రభావం రాష్ట్రంలో పంటలపై పడింది. త్వరలో భూగర్భజల మట్టాలు అడుక్కిపడిపోయి లోతుకు వెళ్లిపోయిన కారణంగా నీటి వసతి సౌకర్యాలు మృగ్యమౌతాయన్న సంకేతాలు లేకపోలేదు. రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు 30 నుంచి 40శాతమే ఉన్నాయి. భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటిపోతే యాసంగి వరి సాగు సాధ్యం కాదనే అంచనాతో ప్రభుత్వాలు నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఎండల తీవ్రతతోపాటు సాగు, తాగు నీటి అవసరాలు పెరగడంతో విద్యుత్తు వినియోగమూ పెరిగింది. రాబోయే 7,8 నెలలో వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పించడం కోసం విబిజి రాంజీ పథకం కింద పనులు కల్పిస్తున్నారు. కానీ వారుపనులు చేయడం కోసం మళ్లీ నీటి ఊటల వెంట పరుగెత్తాల్సి ఉంటుంది. ఒక చుక్క నీటి కోసం వెంపర్లాడే పరిస్థితి కళ్లెదుట కళాశిల్పంలా కనపడుతోంది. తెలంగాణలో 358 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే మరో తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 388 కరవు మండలాలను ప్రకటించారు. వాటిలో తీవ్ర కరవు 283 మండలాలున్నాయి. కరవు మండలాల ఎంపికలో అనేక ఔచిత్యాలు, వైరుధ్యాలున్నా అక్కడి పరిస్థితుల అంచనాలో ఎవరూ కరవులేదని చెప్పే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు మాత్రం ఆగమేఘాల మీద రైతు జనాలను సైతం అప్ర మత్తం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకాంగ్రెస్ పాలకుల అధీనంలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఏరీతిన సహకరిస్తుందోనన్న భయంతో ముందస్తు జాగ్రత్తలకు త్వరపడుతోంది. ఇప్పటికే వరి సాగుకు అధిక నీరు అవసరం ఉన్నందున శుక్రవారం నాటి మంత్రివర్గ ఉప సంఘ సమావేశంలో రాష్ట్రాన్ని ఎల్‌నినో ప్రభావంతో వెన్నాడే పరిస్థితులపై చర్చసాగింది. ఇందులో పలు ఆసక్తికర వివరాలను బయటపడ్డాయి. అక్టోబరులో వర్షాలుతగి నంతగా పడలేదు. తాజా అంచనా ప్రకారం రాష్ట్రంలో 23.4లక్షల ఎకరాల్లోని పంటల సాగుపై ఎల్‌నినో ప్రభా వం పడింది. సాగు విస్తీర్ణంలో ఇది 18.6శాతం మాత్రమే. ఇందులో పత్తి 15.88 లక్షల ఎకరాల్లో వరి 4.78 లక్షల ఎకరాల్లో ఎండిపోయింది. కంది, మొక్క, మిరప, జొన్న పంటలు ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06లక్షల ఎకరాలకు సాగు తగ్గగా, వరి ఒక్కటే 18శాతం తగ్గింది. ఇలా దేశంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. అలా తగ్గిన తొలి ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, మహారాష్ట్రాలు కూడా తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నాయి. తెలంగాణలో 621 మండలాల్లో 324 మండలాల్లో భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లలో తాగునీటికి మాత్రమే సరిపడే నీటి నిల్వలు ఉన్నందున రేపటి ఖరీఫ్ ఆరంభం వరకే తాగునీటికి వాడుకోవాలి. ఈలోగా జలాశయాల్లోని నీటి తోడకానికి పంపింగ్ వ్యవస్థలను సిద్ధం చేయడానికిఅన్ని ఏర్పాట్లు చేసుకోవాల్సి న ఆవశ్యకతను నీటిపారుదల ప్రతి పాదించింది. దాంతో ఆయా మండలాల్లో ఆవశ్యకతల రీత్యా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం నిధుల విడుదల చేసింది. రాష్ట్రంలోని భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నీరు నిల్వసామర్థ్యం 470.2టిఎంసిలు కాగా 179.6 టిఎంసిల నీటి నిల్వలే ఉన్నాయి. వాటిలో మిషన్ భగీరథకు 50 టిఎంసిలు పోగా, మిగిలిన వాటిలో హైదరాబాద్‌లో తాగు నీటి అవసరాలకు 20 టిఎంసిలు తాత్కాలికంగా అవసరమవుతాయి. ఇతర పురపాలికలు, పరిశ్రమలకు మరో 15 టిఎంసిలు కేటాయించారు. అంటే నీటి సరఫరాలోని సంక్లిష్టతలను క్రమబద్ధం చేయాలంటే ప్రత్యామ్నాయాలకై అన్వేషించాలి. గతంలో కన్నా ఈ యేడాది విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం బాగా దెబ్బతింది. పశుదాణాకు బాగా కొరత ఏర్పడి పశువులకు ప్రాణసంకటంగా మారినందున ఎండాకాలం వచ్చేలోగానే 2వేల టన్నుల పశుగ్రాసాన్ని సమీకరించుకోవాలి. ఒక్క పశుగ్రాసం సమకూర్చుకునేందుకే దాదాపు రూ.100 కోట్ల నిధులు కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో తాజా ఇబ్బందులను ఎదుర్కొంటూనే, ఇకపై ఎదురయ్యే సమస్యలకు నిధులు సమకూర్చుకునే యోచనలో ప్రభుత్వం సకల అవస్థలు పడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తోంది.

మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.



అంబేద్కర్

సంపన్నమైన హృదయం లేనప్పుడు, ఎంత సంపద ఉన్నప్పటికీ అది వికారమైన బిచ్చగాడిలా కన్పిస్తుంది.



ఎమర్సన్

## ప్రజావాక్కు

### దమ్మున్న వ్యక్తికి ఓటు వేయండి

ఓటు వేసే ముందు కొంచం ఆలోచించి వేయండి. ఓటు ఎవరికివేద్దాం? మనకులం వాడని, మన మతం వాడని, ఈ ఒక్కసారి అని ఓటేస్తేగతంలో 2019 నుండి 2024 వరకు ఎలా బాధలు పడ్డామో ఆలోచించండి. పొరపాటున ఆలోచించకుండా వేస్తే మరలా ఐదు సంవత్సరాలు ఇబ్బందులుతప్పవు. డబ్బుకు అమ్ముడుపోవద్దు. సారాయికి అమ్ముడు పోవద్దు. అవినీతికి దూరంగా, అక్రమాలకు దూరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, లౌకికవాదానికి అను కూలంగా, విలువలతో ధైర్యంగా ఎవరైతే పనిచేస్తారో వారికి ఓటు వేయండి. ప్రజాస్వామ్యవాదినీ ఎన్నుకుంటే, లౌకిక వాదినిఎన్నుకుంటే, అవినీతికి దూరంగాఉండేవారినీ ఎన్నుకుంటే మనం చెప్పినట్లు వింటాడు. పాలనబాగుంటుంది. అదే డబ్బుతీసుకుని, సారాయికి అమ్ముడుపోతే ప్రశ్నించే హక్కును కోల్పోతాము.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### విమాన భద్రతకు కొత్త సవాళ్లు

విమాన ప్రయాణాల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఎంత సాధారణమయ్యాయో పవర్‌బ్యాంక్‌ల వినియోగం కూడా అంతే పెరిగింది. అయితే నాణ్యతలేని లిథియం అయాన్ బ్యాటరీలు విమాన భద్రతకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఇటీవలి అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో డీజీసీఏ ఒక నిర్దిష్ట పవర్ బ్యాంక్ మోడల్‌పై నిషేధం విధించిందన్న పరిణామం, ప్రయాణ సమయంలోఎలక్ట్రానిక్ పరికరాల భద్రతపై మరింత అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తోంది. లిథియంఅయాన్ బ్యాటరీల్లో తయారీ లోపాలు, నాసిరకం సెల్స్, అంతర్గత షార్ట్‌సర్క్యూట్ లేదా దెబ్బతినడం వల్ల అధిక వేడి ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంటుంది. విమానంలో ఇలాంటి ఘటన ఎదురైతే పరిస్థితిని అదుపు చేయడం అత్యంత కీలకం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### డ్రిప్ ఇరిగేషన్‌వైపు దృష్టిసారించాలి

తెలంగాణా చిన్న నీటి వనరులపైన ఎక్కువ ఆధారపడుతూఉంటుంది. నిజానికి ప్రభుత్వలెక్కల ప్రకారమే 53వేల చెరువులు ఉన్నాయి. ఇప్పుడు ఎల్‌నీనో సమయం. కాబట్టి రబీ సీజన్లో రైతులువాళ్ళ పొలంలో ఒక గుంట స్థలంలో పంట కుంట తవ్వుకోవడం, చెరువు మట్టిని తీసుకొని వెళ్లి పంట పొలాలలో వేసుకోవడం. అంతేకాదు ప్రతి రైతు డ్రిప్ వైపు మళ్లెలా అవగాహనా కల్పించాలి.

- భారత అవినాష్, జనగామ

### ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుల వారు ఏం మాట్లాడుతున్నారో వినేవారికి వెగటు పుట్టిస్తున్నాయి. ఫ్రాన్స్‌లో అల్లర్లు చెలరేగడానికి విదేశాల నుంచి వచ్చిన వలసదారులేనట. వారిని వారి దేశాలకు పంపించి వేయాలని ఫ్రాన్స్ ప్రభుత్వానికి అడక్కపోయినా సలహా యిచ్చారు. అమెరికాలో భారతీయులతో బాటు అనేక మంది విదేశీ ప్రముఖులు మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే స్లోగన్ ట్రంప్ అనక ముందే వెరీ గ్రేట్‌ను చేసారు. నాసా అంతరిక్ష కేంద్రంలో అనేక మంది భారతీయ ఇంజనీర్లు, సైంటిస్టులు అనేకవిజయాలను మూటగట్టి అమెరికాను గొప్ప దేశంగా నిలబెట్టారు. ఈ వాస్తవాలు ట్రంప్‌కు తెలియవా? మాజీ అమెరికా అధ్యక్షులైన రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా లాంటి వారు విదేశీ మేధావులు తమ దేశానికి వచ్చి దేశ పురోగతికి బాటలువేయడం గర్వించదగ్గ విషయం అనిఅన్నారు. ఇప్పుడు ట్రంప్ ఏచిన్న సమాజ హితం కాని సంఘటన జరిగినా దానిని విదేశీయులకు అంటగడుతున్నారు. ఇష్టం వచ్చిన రీతిలో సుంకాలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఇటువంటి చవకబారు చపలచిత్త ఆలోచనారహిత అధ్యక్షునిగా మరల ఎన్నుకోవాలా? ఓట్లేసే అమెరికా ప్రజలు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఒకే పోలీస్ స్టేషన్‌లో ఒకేవ్యక్తిపై 10కి పైగా కేసులు నమోదై సంవత్సరకాలం గడిచిన కూడా ఆవ్యక్తిని కనీసం పోలీస్ స్టేషన్‌కు పోలీస్ అధికారులు పిలిపించడం లేదు. ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలరూపాయలు వసూలుచేయడం, రాష్ట్ర మంత్రుల పేరుతో, పార్లమెంటుసభ్యులు, శాసనసభ్యుల పేరుతో మోసాలు చేయడం, బాండ్ పేపర్ పై అప్పు కాగితాలు రాసి ఇవ్వడం, వారి కుటుంబ సభ్యులు పోలీస్ డిపార్ట్మెంట్‌లో పని చేస్తుండడంతో పోలీస్ అధికారుల అండదండలతో అవినీతి అక్రమాలు చేస్తున్న వ్యక్తులపై సంబంధిత బాధితులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మిత్రులను మరవద్దు

మన జీవితకాలంలో మనకు అన్నివిషయాలలో వెంటనే స్పందించి అడుగడుగునా అండగా నిలిచిన మిత్రులను, శ్రేయోభిలాషులను మరవకూడదు. సంబంధ బాంధవ్యాలు బలపడాలంటే విపత్కర పరిస్థితుల్లో ఒకరికొకరు సహాయ సహకారాలు చేసుకోవాలి. మన జీవితంలో మిత్రులు కీలక పాత్రలు పోషిస్తారు. ఎప్పుడైనా చుట్టూరా మంచి మిత్రులు కలిగి ఉంటే విజయాలు సులభంగా సాధించవచ్చు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కాలుష్యం కట్టడికి తాత్కాలిక ఆంక్షలేనా?

**ఢిల్లీకి కావాల్సింది ఏడాది పొడవునా అమలయ్యే, స్పష్టమైన లక్ష్యాలు, పారదర్శక పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన అమలు వ్యవస్థ కలిగిన కార్యాచరణ. నగరపాలక సంస్థలు, రవాణా అధికారులు, కాలుష్య నియంత్రణ సంస్థలు, రాష్ట్రప్రభుత్వాలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయాలి. చేపట్టిన చర్యలు ఉద్గారాలను ఎంత వరకు తగ్గిస్తున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండే నివేదికల ద్వారా వెల్లడించాలి. పౌరులు చెత్తను బహిరంగంగా కాల్చకపోవడం, వ్యర్థాలను సక్రమంగా పారవేయడం, సాధ్యమైనంతవరకు ప్రజారవాణాను వినియోగించడం ద్వారా సహకరించవచ్చు. అయితే, బలహీనమైన ప్రభుత్వ విధానాలను వ్యక్తిగత బాధ్యతతో మాత్రమే భర్తీచేయలేం. గ్రాప్ మొదటి దశ అమలు తక్షణ అవసరమే. కానీ దాన్ని శాశ్వత పరిష్కారంగా కాకుండా హెచ్చరికగా చూడాలి. కాలుష్యం మరో ప్రమాదకర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఉండకూడదు.**

డి వి బి శ్రీహరిన్

అక్టోబర్ 21న ఢిల్లీలో గాలి నాణ్యత పేలవం స్థాయికి పడిపోవడంతో జాతీయ రాజధాని ప్రాంతం అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మొదటి దశను అమలు చేయాలని వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ఆదేశించింది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు గాలి నాణ్యత సూచీ 244గా నమోదవగా, సాయంత్రం 4 గంటలకు 245కు చేరింది. ఈ స్వల్ప పెరుగుదల కంటే, ప్రతి ఏడాది పునరావృతమవుతున్న కాలుష్య సంక్షోభం మరోసారి మొదలైందన్న విషయమే ఆందోళన కలిగిస్తోంది. సమస్య ముదిరిన తర్వాత అత్యవసర చర్యలకు దిగడం ఢిల్లీకి అలవాటుగా మారింది. గాలి నాణ్యత క్షీణించినప్పుడు కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు గ్రాప్ అవసరమే. మొదటి దశలో రోడ్లపై దుమ్ము, నిర్మాణ పనుల కాలుష్యం, వాహనాల పొగ, పారిశ్రామిక ఉద్గారాలు, బహిరంగంగా చెత్తను కాల్చడం వంటి అంశాలపై నియంత్రణ చర్యలు చేపడతారు. అయితే, అత్యవసర ఆంక్షలు ఏడాది పొడవునా అమలయ్యే సమగ్ర కాలుష్య నియంత్రణ విధానానికి ప్రత్యామ్నాయం కాలేవు. కాలుష్యం పెరిగిన తర్వాతే చర్యలు ప్రారంభిస్తే, సమస్యను నివారించడానికి బదులు దాని ప్రభావాలను ఎదుర్కొనే చక్రంలోనే నగరంచిక్కుకుపోతుంది. ఢిల్లీలో కాలుష్యానికి వాహనాల పొగ, రోడ్ల నిర్మాణ ప్రదేశాల నుంచి వెలువడే దుమ్ము, పారిశ్రామిక ఉద్గారాలు, చెత్త దహనం, పంట అవశేషాల కాల్చివేత వంటి అనేక కారణాలున్నాయి. తక్కువ ఉష్ణోగ్రతలు, గాలుల వేగం తగ్గడం వంటి వాతావరణ పరిస్థితులు కాలుష్య కారకాలు భూమికి సమీపంలోనే పేరుకుపోయేలా చేసి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. అయితే, వాతావరణం కాలుష్యాన్ని పెంచవచ్చేమో కానీ, అధిక ఉద్గారాలకు అదే కారణం కాదు. చలికాలంలో కాలుష్యం తప్పదనే భావన, నివారించగలిగిన విధానపరమైన వైఫల్యాల నుంచి దృష్టిని మళ్లిస్తుంది. నిబంధనలు లేకపోవడం కంటే, ఉన్న నిబంధనలను సక్రమంగా అమలు చేయకపోవడమే ప్రధాన సమస్య. నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ, నిర్మాణ సామగ్రి సురక్షిత రవాణా, కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలు పరిశ్రమలపై సమర్థ పర్యవేక్షణ తప్పనిసరి. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం, కాలుష్యం పెరిగినప్పుడు మాత్రమే కఠిన చర్యలు తీసుకోవడం సరిపోదు. రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, నిర్మాణ వ్యర్థాలను సక్రమంగా తొలగించడం, నిరంతర పర్యవేక్షణ, ఉల్లంఘనలకు తగిన జరిమానాలు విధించడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగం కావాలి. రవాణా విధానంలోనూ మౌలిక మార్పులు అవసరం. ప్రజారవాణా వ్యవస్థ నమ్మదగినదిగా లేకపోతే, రద్దీగా ఉంటే లేదా నివాస ప్రాంతాలు, కార్యాలయాలకు సరైన అనుసంధానం లేకపోతే ప్రజలు వ్యక్తిగత వాహనాలను వదిలిపెట్టడం కష్టం. బస్సు సేవలను మెరుగుపరచడం, చివరి మైలు వరకు రవాణా సౌకర్యాలు కల్పించడం, నడిచేవారికి సురక్షిత మార్గాలు, సైక్లింగ్‌కు అనువైనమౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం ద్వారా కాలుష్యం తక్కువగా ఉండే ప్రయాణ విధానాలను ప్రోత్సహించవచ్చు. తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే వాహనాలు అవసరమే. అయితే, వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం కూడా అంతే ముఖ్యం. పారిశ్రామికాభివృద్ధి, పట్టణీకరణ పర్యావరణ నిబంధనలకు లోబడి సాగాలి. నిర్మాణ సంస్థలు దుమ్ము, వ్యర్థాల నిర్వహణపై బాధ్యత వహించాలి. పరిశ్రమలు ఉద్గార ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలి. స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో చిన్న పరిశ్రమలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అవసరమవవచ్చు. అయితే, ఈ సహాయాన్ని నిరంతర ఉల్లంఘనలను సహించడానికి సాకుగా ఉపయోగించకూడదు. పంట అవశేషాల దహనం సమస్యకు కూడా ఆచరణాత్మక పరిష్కారాలు అవసరం. పంటల మధ్య వ్యవధి తక్కువగా ఉండటం, యంత్రాలఖర్చు అధికంగా ఉండటం, అవశేషాల నిర్వహణకు ప్రత్యామ్నాయాలు అందుబాటులో లేకపోవడం రైతులను ఈ పద్ధతికి నెట్టే అంశాలు. కేవలం శిక్షలు విధించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పంట అవశేషాల నిర్వహణ యంత్రాలను అందుబాటులోకి తేవడం, సకాలంలో సాంకేతిక సహాయం అందించడం, వ్యవసాయ వ్యర్థాలను ఇతర అవసరాలకు వినియోగించే మార్గాలను అభివృద్ధి చేయడం కీలకం. వాయు కాలుష్యానికి రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావు కాబట్టి ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాలి. కాలుష్యంతో కలిగే ఆర్థిక నష్టాన్ని తరచుగా తక్కువగా అంచనా వేస్తున్నారు. కలుషిత గాలి శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధుల ముప్పును పెంచుతుంది. వైద్య ఖర్చులు, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై భారం కూడా అధికమవుతాయి. అనారోగ్యం, అలసట, విధులకు గైర్హాజరు కావడం వల్ల ఉత్పాదకత తగ్గుతుంది. నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, రవాణా రంగంలో పనిచేసేవారు వంటి బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువ సమయం గడిపే వారికి ప్రమాదం మరింత ఎక్కువ. పిల్లలు, వృద్ధులు, ఇప్పటికే అనారోగ్య సమస్యలున్నవారూ తీవ్రంగా ప్రభావితమవుతారు. ఈ ప్రభావాలు ఆసుపత్రులు, కుటుంబాలకే పరిమితం కావు. పని దినాలు కోల్పోవడం, వైద్య ఖర్చులు పెరగడం, నివారించగలిగిన అనారోగ్యాల కారణంగా కుటుంబాలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక వనరులపై అదనపు భారం పడుతుంది. పర్యావరణ పరిస్థితులు నిరంతరం దిగజారితే నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, పెట్టుబడిదారులకు నగరంఆకర్షణ కోల్పోవచ్చు. అందువల్ల స్వచ్ఛమైన గాలి ఆర్థికాభివృద్ధి తర్వాత చూసుకోవాల్సిన అంశం కాదు. అభివృద్ధిదీర్ఘకాలం కొనసాగడానికి అవసరమైన ప్రాథమిక పరిస్థితి. కాలుష్య భారం అందరిపైనా సమానంగా పడదు. ఆర్థికంగా స్థితిమంతులైన కుటుంబాలు గాలి శుద్ధి పరికరాలు కొనుగోలు చేయగలవు లేదా తాత్కాలికంగా వేరే ప్రాంతాలకు వెళ్లగలవు. పేద కుటుంబాలకు అలాంటి అవకాశాలు ఉండవు. రోజువారీ కూలీపై ఆధారపడేవారు కాలుష్యం పెరిగినప్పుడు పనికి వెళ్లకుండా ఉండలేకపోవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలా, కుటుంబ అవసరాల కోసం సంపాదించాలా అనే సంకటంలో పడతారు. కాబట్టి కాలుష్య నియంత్రణ విధానాల్లో ఈ అసమానతలను గుర్తించి, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సూచనలు, కార్మికులకు మెరుగైన రక్షణ, అత్యధికంగా ప్రభావితమయ్యే వర్గాలకు ప్రత్యేక సహాయం అందించాలి. ఢిల్లీకి కావాల్సింది ఏడాది పొడవునా అమలయ్యే, స్పష్టమైన లక్ష్యాలు, పారదర్శక పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన అమలు వ్యవస్థ కలిగిన కార్యాచరణ. నగరపాలక సంస్థలు, రవాణా అధికారులు, కాలుష్య నియంత్రణ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయాలి. చేపట్టిన చర్యలు ఉద్గారాలను ఎంత వరకు తగ్గిస్తున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండే నివేదికల ద్వారా వెల్లడించాలి. పౌరులు చెత్తను బహిరంగంగా కాల్చకపోవడం, వ్యర్థాలను సక్రమంగా పారవేయడం, సాధ్యమైనంతవరకు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా సహకరించవచ్చు. అయితే, బలహీనమైన ప్రభుత్వ విధానాలను వ్యక్తిగత బాధ్యతతో మాత్రమే భర్తీ చేయలేం. గ్రాప్ మొదటి దశ అమలు తక్షణ అవసరమే. కానీ దాన్ని శాశ్వత పరిష్కారంగా కాకుండా హెచ్చరికగా చూడాలి. కాలుష్యం మరో ప్రమాదకర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమేలక్ష్యంగా ఉండకూడదు. ఆ స్థాయికి చేరే పరిస్థితులనే ముందుగా నివారించాలి. అందుకు నిరంతర రాజకీయ సంకల్పం, దీర్ఘకాలిక పెట్టుబడులు, జాతీయ రాజధాని ప్రాంతంలోని ప్రభుత్వాల మధ్య ఏడాదిపొడవునా సమన్వయం అవసరం. ప్రజారోగ్యం, ఉత్పాదకత, జీవన ప్రమాణాలను దెబ్బతీసే అభివృద్ధి నిజమైన పురోగతి అనిపించుకోదు. ఢిల్లీ కాలుష్యసంక్షోభానికి పరిష్కారం మరోవిడత తాత్కాలిక ఆంక్షల్లో లేదు. నిరంతర పర్యవేక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, కఠినమైన నిబంధనల అమలు, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా కాలుష్యాన్ని ముందుగానే నివారించడంలోనే ఉంది. ●



# ఇంటర్నెట్ విస్తరణతో సమాచార భద్రతకు సవాళ్లు!

సి.హెచ్. ప్రతాప్

సాంకేతిక ప్రగతిఅంతరిక్షాన్ని అందుకుంటున్నా దేశంలోని అనేక మారుమూల గ్రామాలకు నేటికీ నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందడం లేదు. నగరాల్లో డిజిటల్ విప్లవం పరుగులు తీస్తుంటే కొండప్రాంతాలు, అటవీ గ్రామాల్లో సమాచార సౌకర్యాల కొరత కొనసాగుతోంది. ఈ సమస్యకు ఉపగ్రహ ఇంటర్నెట్ ఆశాజనకమైన పరిష్కారంగా ముందుకొస్తోంది. అయితే దీని విస్తరణతో పాటు సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యమివ్వాలి. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాల ప్రకారం 2026 మార్చి నాటికి దేశంలో ఇంటర్నెట్‌కనెక్షన్ల సంఖ్య 109.28 కోట్లకు చేరింది. జూన్ నాటికి 111.42 కోట్లకు పెరిగింది. వీటిలో 106.64 కోట్ల కనెక్షన్లు వైర్‌లెస్ ఆధారితమైనవే. మారుమూల ప్రాంతాల్లో టెలికాం మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధిక వ్యయం, భౌగోళిక అవరోధాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఉపగ్రహ సేవలతో వీటిని కొంతవరకు అధిగమించవచ్చు. సాధారణఇంటర్నెట్ సేవలకు భూగర్భ కేబుళ్లు, సెల్ టవర్లు అవసరం. భూమికి సమీప కక్ష్యల్లో పరిభ్రమించే ఉపగ్రహాల ద్వారా విస్తారమైన ప్రాంతాలకు సమాచార సేవలను అందించవచ్చు. గ్రామీణ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు, రైతులకు వాతావరణ సూచనలు, పంటల ధరల సమాచారం, మారుమూల వైద్యకేంద్రాలకు నిపుణుల సలహాలు అందించడంలో ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. వరదలు, తుఫానుల సమయంలో భూమిపై సమాచార వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు ప్రత్యామ్నాయ సమాచార మార్గంగానూ సేవలందించగలదు. అయితే ఉపగ్రహ ఇంటర్నెట్ వినియోగంలో కొన్ని భద్రతాపరమైన ముప్పులున్నాయి. ఇళ్లలో ఏర్పాటు చేసే రిసీవర్లు, రౌటర్లలో భద్రతా లోపాలుంటే హ్యాకర్లు వాటిని నియంత్రించే ప్రమాదముంది. సరైన సాంకేతీకరణ లేకపోతే వ్యక్తిగత సమాచారం అనధికార వ్యక్తులకు చిక్కవచ్చు. నకిలీ సంకేతాలతో సమాచార వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం, రేడియో సంకేతాలకు అంతరాయం కలిగించడం వంటి సమస్యలూ తలెత్తవచ్చు. ఉపగ్రహ సేవలను నిర్వహించే భూకేంద్రాలపై సైబర్‌దాడులు జరిగితే అనేక ప్రాంతాల్లో సమాచార సేవలు నిలిచిపోయే అవకాశముంది. అత్యవసర సమయాల్లో ఇటువంటి అంతరాయాలు సహాయక చర్యలను దెబ్బతీస్తాయి. ఈ ప్రమాదాల నివారణకు బలమైన సాంకేతీకరణ, సాఫ్ట్‌వేర్ భద్రతా నవీకరణలు, స్వతంత్ర సాంకేతిక తనిఖీలు అవసరం. వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, పరికరాల స్థాన సమాచారానికి రక్షణ కల్పించాలి. ఉపగ్రహ సేవలను సంప్రదాయ టెలికాం వ్యవస్థకు అనుబంధంగా అభివృద్ధి చేయాలి. పరికరాల ధరలు, నెలవారీ చార్జీలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంతోపాటు ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అంతరిక్షం నుంచి అందేఇంటర్నెట్ సామాన్యుడి జీవితంలో వెలుగులు నింపాలి. సాంకేతిక విస్తరణకు ప్రజల సమాచార భద్రత, ఆర్థిక స్థోమత, అవసరాలే ప్రామాణికం కావాలి. ●

# డ్రగ్స్ నిర్మూలన ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం



మేకిరి దామోదర్

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించడం మనకు ఒక గొప్ప అవకాశమే కాదు. అంతకుమించిన బాధ్యత కూడా! యువత శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోగలిగితే ఆర్థికాభివృద్ధిలో దేశం అగ్రగామిగా నిలవగలదు. కానీ నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, ఉపాధి అవకాశాల లేమి, మాదకద్రవ్యాల వ్యసనం వంటి సమస్యలు యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయి. ఒకవైపు చదువుకున్నా కొలువులు లభించక యువత నిరాశకు గురవుతుంటే, మరోవైపు కొందరు మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. యువతకు ఉపాధి భరోసా కల్పించడం, డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం కావాలి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) వంటి నివేదికలు యువతలో విద్య, శిక్షణ, ఉపాధికి సంబంధించిన సమస్యలను వెలుగులోకి తెస్తున్నాయి. దేశవ్యాప్తంగా 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో గణనీయమైన శాతం మంది చదువులోనూ, ఉద్యోగాల్లోనూ, వృత్తి నైపుణ్య శిక్షణలోనూ లేకపోవడం ఆందోళనకరం. ఆర్థిక ఇబ్బందులు, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించకపోవడం వంటి కారణాలు యువత అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. చదువులు పూర్తిచేసినా తగిన ఉద్యోగం దొరకకపోవడంతో చాలా మంది నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య సమన్వయం కొరవడటంతో డిగ్రీలు ఉన్నా ఉపాధి పొందలేని పరిస్థితి నెలకొంటోంది. ఉద్యోగాల కోసం యువత రోడ్లెక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జాప్యం చేస్తే నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుంది. వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సింది పోయి, ప్రశ్నించే యువతను ప్రత్యర్థులుగా చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికివిరుద్ధం. నిరసనల వెనుక ఉన్ననిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తుపై అభద్రత వంటి కారణాలను పాలకులు అర్థం చేసుకోవాలి. మహిళల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉన్నత విద్య అభ్యసిస్తున్నప్పటికీ కుటుంబ బాధ్యతలు, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాల కొరత, కార్యాలయాల్లో అనుకూల వాతావరణం లేకపోవడం వంటి కారణాలతో చాలామంది ఉద్యోగాలకు దూరమవుతున్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, సమానఅవకాశాలు, నైపుణ్య శిక్షణ కల్పించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి వారి సేవలను ఉపయోగించుకోవచ్చు. యువతకు నాణ్యమైనవిద్య, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, పారదర్శక నియామకాలు, స్వయం ఉపాధికి అవసరమైన తోడ్పాటుఅందించాలి. ఖాళీగా ఉన్న సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకునేలా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా



కార్యక్రమాలను ప్రోత్సహించాలి. నిరుద్యోగం ఒక్కటే మాదకద్రవ్యాల వినియోగానికి కారణమని చెప్పలేం. స్నేహితుల ఒత్తిడి, కొత్తదనం చూడాలనే ఆసక్తి, మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వ్యసనానికి సంబంధించిన ఇతర పరిస్థితులు కూడా యువతను ఆ దిశగా నడిపించవచ్చు. అందుకే ఉపాధి కల్పనతోపాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన, కుటుంబ ఆదరణ, సానుకూల సామాజిక వాతావరణం కూడా అవసరం. మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన సమస్య కాదు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పరిసరాల్లోనూ ఈ ముప్పు విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. చిన్న వయసులోనే మత్తు పదార్థాల పరిచయం ఏర్పడితే విద్యాభ్యాసం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, భవిష్యత్తు లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సరదా కోసమో, స్నేహితుల ప్రోత్సాహంతోనో మొదలైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉంది. దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు చదువుపై ఏకాగ్రత తగ్గి, కుటుంబాల్లో ఆందోళన పెరుగుతుంది. కొందరు వ్యసనానికి అవసరమైన డబ్బుకోసం నేరాలకు పాల్పడే ప్రమాదమూ ఉంది. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారులు తమ స్వార్థ లాభాల కోసం యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి ఉపేక్ష ఉండకూడదు. డ్రగ్స్ సరఫరా మార్గాలను గుర్తించడం, అక్రమ రవాణాను అడ్డుకోవడం, విక్రయ కేంద్రాలపై నిఘా పెట్టడం, అంతర్రాష్ట్ర ముఠాలపై సమన్వయంతో దర్యాప్తు చేయడం అత్యవసరం. పట్టుబడిన చిన్నస్థాయి వినియోగదారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం కాకుండా, అసలు సరఫరాదారులు, నిర్వాహకులు, ఆర్థికంగా అండగా నిలిచే నెట్‌వర్క్‌లను చట్టపరంగా కట్టడి చేయాలి. చట్టాల అమలులో పారదర్శకత, దర్యాప్తులో వేగం, నేర నిరూపణకు సమర్థమైన చర్యలు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం చేపట్టే మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలుగా మారాలి. అయితే ప్రచారాలు, నినాదాలకే పరిమితం కాకుండా వాటి ఫలితాలను నిరంతరం సమీక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు శాఖలు, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించాలి. అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే విద్యార్థులను అవమానించకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన సహాయం అందించాలి. వ్యసనానికి లోనైనవారిని నేరస్థులుగా ముద్రవేయకుండా వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా సాధారణ జీవనంలోకి తీసుకురావాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. భయపెట్టి, శిక్షించి సమస్యను దాచిపెట్టేలా చేయకుండా, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవాలి. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు జీవన నైపుణ్యాలు, ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, మంచి చెడులను విచక్షణతో గుర్తించే సామర్థ్యాన్ని నేర్పాలి. యువజన సంఘాలు, క్రీడాసంస్థలు, సామాజిక కార్యకర్తలుమాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన ఉపాధిహామీలను కార్యాచరణలో చూపాలి. ఖాళీఉద్యోగాలను భర్తీచేయడం, నైపుణ్య శిక్షణను విస్తరించడం, చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం అందించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. నిరుద్యోగసమస్యను పరిష్కరించడం ఒకవైపు, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారాన్ని అణచివేయడం మరోవైపు సమాంతరంగా సాగాలి. యువతకు భవిష్యత్తుపై ఆశ కల్పించినప్పుడే వారు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం, ఉపాధి భరోసా కలిగిన యువతఈ రెండు లక్ష్యాలు నెరవేరినప్పుడే వికసిత భారత స్వప్నం సాకారమవుతుంది. ●

# ఆత్మనిర్భరత దిశగా పాతికేళ్ల ప్రస్థానం





### భారతీయుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం

### క్రీడలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ చెల్లింపులు, పర్యావరణ పరిరక్షణలో గణనీయ ప్రగతి

## ప్రధాని మోడీపై మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ప్రశంసలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** భారత్‌కు 2003లో తొలిసారి వచ్చినప్పుడు నరేంద్ర మోడీ గురించి తనకు పెద్దగా తెలియదని, అయితే అప్పటికే ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకున్నారని ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్‌పీటర్సన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారనే విషయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత సుదీర్ఘకాలం నాయకత్వంలో కొనసాగడం అసాధారణమని అభిప్రాయపడ్డారు. తాను బ్రిటన్‌కు చెందిన వాడినని, 2014లో మోడీ భారత ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బ్రిటన్‌లో ఆరుగురు ప్రధానమంత్రులు మారారని గుర్తుచేశారు. ఇలాంటి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ప్రజాస్వామ్య దేశంలో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని భారత్ పర్యటనలకే కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ క్రికెట్ ఆడటం, దేశవ్యాప్తంగా పర్యటించడం, ఎన్నో విశిష్ట వ్యక్తులను కలవడం, ప్రకృతి ఒడిలో సమయం గడపడం, స్నేహాలను ఏర్పరచుకోవడం ద్వారా భారత్‌లో వచ్చిన మార్పులను దగ్గరగా గమనించానని భారతీయులు తాము ఏ పనినైనా సాధించగలమనే ధైర్యంతో ముందుకు సాగుతున్నారని అభిప్రాయపడ్డారు. క్రీడారంగంలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భారత క్రికెట్‌లో గతంలోనూ అద్భుతమైన ఆటగాళ్లు, అభిమానుల ఆదరణ ఉన్నప్పటికీ, జట్టు విజయాలు కొంతమంది అత్యుత్తమ ఆటగాళ్లపై ఎక్కువగా ఆధారపడేవని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత జట్లలో ప్రతిభావంతులైన ఆటగాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. రిజర్వ్ బెంచ్‌లో ఉన్న ఆటగాళ్లు సైతం ప్రపంచంలోని అత్యుత్తమ జట్లను ఓడించగల స్థాయికి ఎదిగారని, యువ క్రికెటర్లు అత్యున్నత స్థాయిలో ఆడగలమనే నమ్మకంతో బరిలోకి దిగుతున్నారని వివరించారు. ఫిట్‌నెస్, సన్నద్ధత, వృత్తిపరమైన నైపుణ్యాల విషయంలో భారత క్రికెట్‌లో విపరీతమైన మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. పురుషుల క్రికెట్ జట్టు ఎప్పటినుంచో బలమైన జట్టుగా ఉన్నప్పటికీ, మహిళల క్రికెట్ సాధించిన పురోగతి ప్రత్యేకంగా సంతోషాన్నిస్తోందని తెలిపారు. గత ఏడాది మహిళల ప్రపంచకప్ విజయం ఈ ఎదుగుదలకు మరో ఉదాహరణగా పేర్కొన్నారు. భారతదేశం క్రికెట్‌లో కీలక శక్తిగా ఉన్నందున, ఇక్కడ మహిళల క్రికెట్ అభివృద్ధి ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. అథ్లెటిక్స్, షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, హాకీ, టెన్నిస్ తదితర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. మోడీఇచ్చిన ఫిట్ ఇండియా పిలుపు దేశవ్యాప్తంగా ఆరోగ్యంపై అవగాహన పెరగడానికి దోహదపడిందని పేర్కొన్నారు. యోగా భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూనే ఆధునిక జీవనశైలి లోనూ భాగమైందని 2014లో ఐక్యరాజ్య సమితిలో మోడీ ప్రతిపాదించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం నేడు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతోందని గుర్తుచేశారు. భారత్‌లో డిజిటల్ చెల్లింపులపై విస్మయం కలిగిందని వీధి వ్యాపారులు సైతం క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు రహిత చెల్లింపులను స్వీకరిస్తున్నారని చెప్పారు. భారత్ పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, ముఖ్యంగా గుజరాత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం, అత్యంత ఎత్తైన విగ్రహం ఉండటం దీనికి ఉదాహరణలని పేర్కొన్నారు. భారతదేశంలో వన్యప్రాణులను కాపాడేందుకు జరుగుతున్న కృషి తనను ఎంతగానో ఆకట్టుకుందని. కజిరంగా పార్కులో సమయం గడిపానని, ఖడ్గమృగాల సంరక్షణపై ప్రత్యేక ఆసక్తి ఉందని చెప్పారు. 2022లో మోడీనుంచి ఒక లేఖ అందుకున్న తర్వాత తాను రాసిన పోస్టును ఆయన గుర్తుచేసు కున్నారు.

2003లో తొలిసారి భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రతి పర్యటనతో ఈ దేశంపై తనకు ప్రేమ మరింత పెరిగిందని అందులో పేర్కొన్నట్లు తెలిపారు. భారత్‌లో తనకు అత్యంత ఇష్టమైనది ఏమిటని అడిగితే, తన సమాధానం ఒక్కటేనని అది భారతీయు లేనని చెప్పారు. భారతీయుల ఆధునికత తమ సంప్రదాయాలను దూరం చేయలేదని, అదే తనకు నచ్చే ముఖ్యమైన లక్షణమని పేర్కొన్నారు. ప్రాచీన దేవాలయాలు, సంప్రదాయాల పక్కనే ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతికత కనిపిస్తోందని తెలిపారు. 25 ఏళ్ల ప్రస్థానం ఒక అసాధారణ మైలురాయి అని పేర్కొంటూ, ఈ ప్రయాణానికి మోడీకి అభినందనలు తెలిపారు. ఆయనకు మంచి ఆరోగ్యం కలగాలని, మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# ట్రంప్‌ది మోసపూరిత పాలన



### అమెరికా అధ్యక్షుడిపై మాజీ అధ్యక్షుడు ఒబామా ఘాటు విమర్శలు

**వాషింగ్టన్, అక్టోబరు 25:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్ర విమర్శలు చేశారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం రాత్రి ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు, సుంకాల విధింపు, అధ్యక్ష పదవిని స్వప్రయోజనాలకు వాడుకోవడం వంటి అంశాలపై ఒబామా తీవ్ర ఆరోపణలు చేశారు. ఎవరూ కోరుకోని, ఎవరూ ఓటు వేయని అనవసరమైన యుద్ధానికి ట్రంప్ తెరలేపారని ఒబామా విమర్శించారు. తన హయాంలో కుదుర్చుకున్న అణు ఒప్పందం కారణంగా ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించాల్సిన అవసరం లేకుండానే ఇరాన్‌ను అణ్వాయుధాల తయారీ నుంచి నిరోధించగలిగామని ఆయన గుర్తు చేశారు. అయితే గత ఏడు నెలలుగా సాగుతున్న ఘర్షణల వల్ల మిత్రదేశాలు, అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగాయని, ఈ దాడుల్లో అమెరికన్లు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పలువురు గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టుచిక్కడం వల్లే చమురు, డీజిల్ ధరలు పెరిగాయని ఒబామా మండిపడ్డారు. డొనాల్డ్ ట్రంప్‌కు సుంకాలంటే అమితమైన ఇష్టమని, అయితే వాటి భారం అంతిమంగా వినియోగదారులపైననే పడుతుందని హెచ్చరించినా పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ట్రంప్ పాలనను ఒక 'మోసపూరిత వ్యవస్థగా, మోసపూరిత పాలన'గా ఆయన అభివర్ణించారు. అధ్యక్ష పదవిని ట్రంప్ స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మీమ్ కాయిన్లు, తన సంతానానికి చెందిన కంపెనీలకు పన్ను చెల్లింపుదారుల నిధులతో కాంట్రాక్టులు కట్టబెట్టడం, వెనుజులాకు చెందిన బిలియనీర్‌కు క్షమాభిక్ష ప్రసాదించడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఒబామా ఉదహరించారు. నవంబరు 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకట్ట వేయడానికి లభించిన ఆఖరి అవకాశమని ఒబామా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఒహాయో గవర్నర్ అభ్యర్థి అమీ యాక్టన్, సెనేట్ అభ్యర్థి షెరాడ్ బ్రౌన్‌లకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు.

# అమెరికా సాయం ఉక్రెయిన్ ధనవంతులకే చేరుతోంది: ఎలాన్ మస్క్



**కీవ్, అక్టోబరు 25:** అమెరికా అందిస్తున్న వందల బిలియన్ల డాలర్ల సాయం వల్ల ఉక్రెయిన్‌లోని సంపన్నులు మరింత ధనవంతులవుతున్నారని టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యాతో యుద్ధం కారణంగా సాయం కింద ఉక్రెయిన్‌కు వెళ్తున్న వందల బిలియన్ల డాలర్లతో అక్కడి సంపన్నులు మరింత సంపద కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజల పిల్లలు మాత్రం యుద్ధంలో పోరాడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. మస్క్ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందిస్తూ ఆయనకు మద్దతుగా మాట్లాడారు. ఆయన న్యాయంగా వ్యవహరించే వ్యక్తి అంటూ ప్రశంసించారు.

**ఎట్టకేలకు స్టార్‌లింక్ వేగపరిమితులు తొలగించారు: ఉక్రెయిన్:** ఉక్రెయిన్ సైన్యం, డ్రోన్ల నిర్వహణకు ఎంతో కీలకమైన స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై విధించిన వేగ పరిమితులను ఎట్టకేలకు తొలగించినట్లు ఉక్రెయిన్ రక్షణ శాఖ శనివారం వెల్లడించింది. ప్రస్తుతం గంటకు 400 కి.మీ. వేగంతో ప్రయాణించగల పరికరాలు కూడా ఈ ఇంటర్నెట్ వేగంతో పనిచేయగలు గుతున్నాయని ప్రకటించింది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా రాయబారులు ప్రయత్నాలు ప్రారంభించిన తరుణంలో ఈ పునరుద్ధరణ చోటుచేసుకుంది. వచ్చే నెలలో అమెరికా, ఉక్రెయిన్‌లతో త్రైపాక్షిక భేటీలో చర్చించేందుకు రష్యా పచ్చజెండా ఊపింది. శుక్రవారం ఉక్రెయిన్ లోని దక్షిణ ఖేర్సన్ ప్రాంతంలో యుద్ధంతో ధ్వంసమై రష్యా ఆక్రమిత పట్టణమైన ఒలేష్కి చుట్టూ అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో కుదిరిన స్థానిక కాల్పుల విరమణకు రష్యా, ఉక్రెయిన్‌లు అంగీకరించాయి.

## ఎక్స్‌మనీ విభాగంలో కొత్త ఫీచర్ తెచ్చిన మస్క్

**న్యూయార్కు, అక్టోబరు 25:** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, తమ యూజర్ల కోసం మరో ఆసక్తికరమైన ఫీచర్‌ను ప్రతిపాదించారు. ఇకపై ఎక్స్‌లో ఏదైనా పోస్ట్ నచ్చితే, దాని కింద ఉన్న లైక్ బటన్‌ను ఎక్కువసేపు నొక్కి ఉంచడం ద్వారా ఆ పోస్ట్ చేసిన వారికి ఒక డాలర్ పంపే సౌకర్యాన్ని తీసుకురానున్నట్లు ఆయన ఆదివారం ప్రకటించారు. ఈ ఫీచర్ ద్వారా ప్లాట్‌ఫామ్‌లోనే సులభంగా చిన్న మొత్తంలో డబ్బు పంపించుకునే అవకాశం కలుగుతుంది. ఈ కొత్త ఫీచర్, ఎక్స్‌ను కేవలం సోషల్ నెట్‌వర్కింగ్ వేదికగానే కాకుండా ఫైనాన్షియల్ సర్వీసులతో కూడిన ఒక ఎవ్రీథింగ్ యాప్‌గా మార్చాలన్న మస్క్ విస్తృత వ్యూహంలో భాగం.



# ట్రామ్ టికెట్ కొన్నా జరిమానా చెల్లించుకున్న పర్యాటకులు

**ప్యారిస్, అక్టోబరు 25:** యూరప్ యాత్ర ఎంతో మధురంగా ఉంటుందని ఊహించుకున్న ఓ భారత జంటకు ఫ్రాన్స్‌లో ఊహించని షాక్ తగిలింది. కేవలం రూ.300 విలువైన ట్రామ్ టికెట్ విషయంలో జరిగిన ఒక చిన్న పొరపాటుకు, ఏకంగా రూ.13,000 జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఈ సంఘటన యూరప్ పర్యటనకు వెళ్లే వారికి ఒక ముఖ్యమైన హెచ్చరికగా నిలుస్తోంది. వంచ, సాక్షమ్ అనే భారత ట్రావెల్ క్రియేటర్ల జంట ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ప్రసిద్ధులు తమ మొదటి యూరప్ ట్రిప్‌లో భాగంగా ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రయాణం కోసం ఒక వెండింగ్ మెషీన్ నుంచి ట్రామ్ టికెట్ కొనుగోలు చేశారు. ఆ టికెట్‌ను పక్కనే ఉన్న చిన్న కియోస్క్ వద్ద ట్యాప్ చేసి "వాలిడేట్" చేయాలన్న నిబంధన వారికి తెలియదు. దీంతో వారు నేరుగా ట్రామ్ ఎక్కేశారు. రెండు స్టాప్‌లు దాటిన తర్వాత ఒక టికెట్ ఇన్‌స్పెక్టర్ వారి వద్దకు వచ్చి టికెట్లను తనిఖీ చేశారు. వారు టికెట్ చూపించినా, అది వాలిడేట్ చేయనందున చెల్లదని చెప్పి, అక్కడికక్కడే భారీ జరిమానా విధించారు. తాము పర్యాటకులమని, నిబంధన తెలియక పొరపాటు జరిగిందని, కావాలని చేయలేదని వారు ఎంతగానో వివరించే ప్రయత్నం చేశారు. తామేమీ తప్పు చేయలేదని వాదించారు. తమ వద్ద ఉన్న బుకింగ్స్ చూపించి, తమ ఎయిర్‌బీఎన్‌బీ హోస్ట్‌తో కూడా మాట్లాడించారు. అయినప్పటికీ, అధికారి కనికరించకుండా పూర్తి జరిమానా మొత్తాన్ని వసూలు చేశారు. ఈ అనుభవాన్ని వారు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో రూపంలో పంచుకోగా, అది వైరల్‌గా మారింది. ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో ఇది సర్వసాధారణమని, టికెట్ కొని వాలిడేట్ చేయకపోతే భారీ జరిమానాలు తప్పవని పలువురు కామెంట్ల రూపంలో తెలిపారు. సరైన సూచనలు లేకపోవడం, ఫైన్‌ల ద్వారా ఇన్‌స్పెక్టర్లకు ప్రోత్సాహకాలు ఉండటం వంటివి ఈ సమస్యకు కారణమని కొందరు అభిప్రాయపడ్డారు. ఫ్రాన్స్ సహా పలు యూరప్ దేశాల్లో ప్రజా రవాణా వ్యవస్థలో టికెట్ కొనడం ఒక ఎత్తయితే, దానిని ప్రయాణానికి ముందు కచ్చితంగా వాలిడేట్ చేయడం మరో ముఖ్యమైన నిబంధన. ఈ విషయం తెలియక ఎంతో మంది పర్యాటకులు ఇలా ఆర్థికంగా నష్టపోతున్నారు.

# 1న జరిగే 'రామ్‌లీలా' ర్యాలీకి 10లక్షల మంది

### కాంగ్రెస్ పార్టీ అంచనా

### సర్ రద్దు, సిఇసి తొలగింపు డిమాండ్లతో నిరసనలు



**న్యూఢిల్లీ,అక్టోబరు 25:** ఢిల్లీలోని చారిత్రక రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న జరగనున్న ఇండియా కూటమి భారీ ర్యాలీకి కనీసం 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. ఓట్ చోరీకి వ్యతిరేకంగా, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో జరుగుతున్న అక్రమాలపై నిరసనగా ఈ ర్యాలీని నిర్వహించనున్నారు. అర్హులైన పౌరుల పేర్లు జాబితా నుంచి తొలగిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియలో పక్షపాత ధోరణి కనిపిస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది. రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని కాపాడే లక్ష్యంతో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా చేపట్టిన ఓట్ బచావో దేశ్ బచావో కాంపెయిన్ కీలక దశకు చేరుకుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయటం కోసం హర్యానాలో పార్టీ సంస్థాగత ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ప్రతి జిల్లా, బ్లాక్, గ్రామం, పోలింగ్ బూత్ స్థాయి నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణు గోపాల్ అధ్యక్షతన హర్యానా నాయకులతో సమావేశం జరిగి ర్యాలీ సన్నాహాలను సమీక్షించారు. ఢిల్లీ యూనిట్ నాయకులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షులతో కూడా సమావేశాలు జరిపి లక్ష్యాలు నిర్ణయించారు. ఇంతకు ముందు జరిగిన ఢిల్లీ చలో మార్చ్‌కు ఇది భారీ ముగింపు రూపంగా భావిస్తున్నారు. ఈనెల 30న సీఈసీపై పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. రాహుల్ గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమంలో పోస్ట్‌చేస్తూ విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులందరినీ ర్యాలీకి హాజరు కావాలని పిలుపునిచ్చారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి 15 వేల మంది వస్తారని అక్కడి నాయకులు తెలిపారు. ట్రేడ్ బాడీలు కొందరు ర్యాలీని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసినా, ప్రతిపక్షంముందుకు సాగుతుందని స్పష్టం చేసింది. ఈర్యాలీ కేవలం ఒక నిరసన కాదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ఓటు హక్కు రక్షణకు సంబంధించిన పెద్ద సందేశంగా పార్టీ చెప్తోంది.

# కన్నడిగులకు అన్యాయం జరిగితే కార్పొరేట్ సంస్థలపై చర్యలు

### కర్ణాటక సిఎం డికె శివకుమార్ హెచ్చరిక



**బెంగళూరు, అక్టోబరు 25:** బెంగళూరులోని ఐటీ, వివిధ ప్రైవేటు సంస్థల్లో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో తీవ్ర వివక్ష జరుగుతోందనే ఆరోపణలు కన్నడ నాట చర్చనీయాంశమౌతోన్నాయి. స్థానికులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెడుతున్నారనే ఫిర్యాదులను కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఐటీ, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలకు హెచ్చరికలు సైతం జారీ చేశారు. కన్నడిగుల ప్రయోజనాలు, వారి హక్కులను దెబ్బతీసేలా ఏ ప్రైవేటు సంస్థ వ్యవహరించినా చట్టపరమైన తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక గడ్డపై కన్నడిగుల ప్రయోజనాలే అత్యున్నతమైనవని, స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా పక్కనబెట్టడం ఎంతమాత్రం తగదని ఆయన తేల్చి చెప్పారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియల్లో స్థానిక అభ్యర్థులను తిరస్కరిస్తున్నారంటూ ఇటీవల వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నామని డీకే శివకుమార్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇటీవల సోషల్ మీడియాలో కర్ణాటకకు చెందిన ఓ యువతి పంచుకున్న వీడియో దీనికి ప్రధాన కారణం. బెంగళూరులోని ఐటీ సంస్థలు తమ నియామక ప్రక్రియల్లో అనుసరిస్తున్న తీరు, స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఈ వీడియో ద్వారా ఆమె వెల్లడించింది. ఇది వైరల్ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కన్నడ సంఘాలు, స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమైంది. ఉద్యోగార్థులు తమ రెజ్యూమ్‌లలో లేదా బయోడేటాలో మాతృభాషగా కన్నడ అని పేర్కొంటే, ఆ దరఖాస్తులను తిరస్కరిస్తోన్నారని ఆ యువతి ఆరోపించారు. బెంగళూరులోని స్థానిక ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి తక్కువ వేతనాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అర్హత కలిగిన కన్నడిగులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం, కన్నడ పరిరక్షణ సంఘాలు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ పరిణామాలపై డీకే శివకుమార్ స్పందించారు. కన్నడిగుల హక్కులు, స్వాభిమానం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారత టెక్ క్యాపిటల్ గా బెంగళూరు ప్రసిద్ధి చెందిందంటే, దానికి కారణం ఇక్కడి భూమి, మౌలిక సదుపాయాలు, స్థానిక యువత కష్టం, నైపుణ్యాలే మూలకారణమని గుర్తుచేశారు. స్థానిక యువత ప్రతిభపై తమకు పూర్తి నమ్మకం ఉందని, వారిని చులకనగా చూడటానికి వీల్లేదని పేర్కొన్నారు.

# కాల్పుల ఘటనపై తొలిసారి స్పందించిన టైగర్ ష్రాఫ్



**ముంబయి, అక్టోబరు 25:** తన కారుపై ఇటీవల జరిగిన కాల్పుల ఘటనపై బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ తొలిసారిగా స్పందించాడు. తాను ఇప్పటికీ తీవ్ర షాక్‌లో ఉన్నానని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేనప్పుడు తనపై ఎందుకు దాడి జరిగిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి విచారించగా, టైగర్ ఈ విషయాలు వెల్లడించాడు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో జుహూ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఫుట్‌బాల్ సెషన్ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు టైగర్ ప్రయాణిస్తున్న బీఎండబ్ల్యూ కారుపై ఐదు నుంచి ఆరు రౌండ్లు కాల్పులుజరిపారు. ఆ సమయంలో కారు ముందు ప్యాసింజర్ సీటులో ఉన్న టైగర్ ష్రాఫ్ సురక్షితంగా బయటపడగా, కారు డ్రైవర్ ఫిర్దౌస్ బలోచ్, వ్లాగర్ ఉమేశ్ చౌహాన్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన టైగర్, స్వయంగా కారు నడుపుతూ గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించాడు. ఘటన తర్వాత పారిపోయిన షూటర్లను పోలీసులు గుర్తించారు. హర్యానాకు చెందిన ఫూల్ సింగ్ (18), రెహాన్ రైసుద్దీన్ అన్సారీ (18), బిహార్‌కు చెందిన హృతిక్ కుమార్ అలియాస్ రోషన్ (22)లను మరుసటి రోజే రాజస్థాన్‌లోని కోటాలో అరెస్ట్ చేశారు. దాడికి ఉపయోగించిన టర్కీ మేడ్ పిస్టల్ మధ్యలోనే జామ్ అయినట్లు, రెండు బుల్లెట్లు కిందపడిపోయినట్లు తెలిసింది. ఆయుధాలను సూరత్‌లోని బస్‌స్టాండ్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడికి తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్‌గ్యాంగ్ ప్రకటించుకుంది. సల్మాన్ ఖాన్‌తో టైగర్ ష్రాఫ్ సన్నిహితంగా ఉండటమే ఈ దాడికి కారణమన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ కేసుతో సంబంధం ఉన్న 11 మందిని ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఇప్పటివరకు అరెస్ట్ చేశారు. నిందితులకు సహకరించిన ఇండోర్‌కు చెందిన 22 ఏళ్ల యువకుడిని శనివారం అదుపులోకి తీసుకున్నారు.

# మన క్షిపణి వ్యవస్థలతో శత్రువులకు వణుకు: ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎపి సింగ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. గత ఏడాది పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమయంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని చెప్పారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఏపీ సింగ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల్లో అస్థిరత కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు, ఇండోపసిఫిక్‌లో నెలకొన్న పరిస్థితిని వైమానిక దళం నిశితంగా పర్యవేక్షిస్తోందని, దేశ భద్రతను కాపాడటానికి ఐఏఎఫ్ ఎప్పుడూ సిద్ధంగా ఉందని ఏపీ సింగ్ అన్నారు. మరింత సంక్లిష్టమైన విన్యాసాలు, కార్యాచరణల ద్వారా మిత్రదేశాల వైమానిక దళాలతో పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇండోపసిఫిక్‌లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడానికి అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ సభ్య దేశాలతో కలిసి భారత్ పనిచేస్తున్నదని తెలిపారు. ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లకు ఇటీవల ఐఏఎఫ్ పంపిన దళాలు సుదూర కార్యకలాపాలు, సముద్ర వైమానిక కార్యకలాపాలలో విలువైన అనుభవాన్ని అందించాయని ఏపీ సింగ్ పేర్కొన్నారు. భారత్, అమెరికా సహా ఇతర దేశాలు స్వేచ్ఛాయుత, శాంతియుత ఇండోపసిఫిక్ కోసం ఒత్తిడి చేస్తున్నప్పటికీ వనరులు సమృద్ధిగా ఉన్న ఈ ప్రాంతంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## సెన్సార్ బోర్డులో 500కిపైగా ఫీచర్‌ఫిలింల సర్టిఫికేషన్ల చోరీ




**న్యూఢిల్లీ,అక్టోబరు 25:** కేంద్ర ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు (సీబీఎఫ్‌సీ)లో భారీ భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. సుమారు 500కు పైగా ఫీచర్ ఫిల్మ్‌లతో సహా ఇతర చిత్రాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సర్టిఫికేషన్ రికార్డులు ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. సినిమాల సెన్సార్ అనుమతుల కోసం నిర్మాతలు దరఖాస్తు చేసుకునే అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థఈ సినీప్రమాణ్ పోర్టల్‌నుంచే ఈ సమాచారం బయటకు పొక్కినట్లు తేలింది. ఈ ఘటన సెన్సార్ బోర్డు పనితీరు, డిజిటల్ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.

## ఆరునెలల్లో 23 మంది దోషులకు మరణశిక్ష విధించిన జడ్జి



**లక్నో, అక్టోబరు 25:** ఒక న్యాయమూర్తి ఆరు నెలల్లో 23 మంది నిందితులకు మరణశిక్షలు విధించారు. హత్యలకు సంబంధించిన 11 కేసుల్లో ఈ మేరకు తీర్పులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ జడ్జిని ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 11 కేసుల్లో 23 మందికి మరణశిక్షలు విధించారు. దీనిపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ముజఫర్ నగర్‌లోని కుటుంబ న్యాయస్థానానికి జడ్జి రవి కుమార్ దివాకర్‌ను బదలీ చేశారు.

## యుద్ధ నష్టంపై పరిహారం డిమాండ్ చేస్తున్న ఇరాన్



**టెహ్రాన్, అక్టోబరు 25:** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఓవైపు, తమ దేశంపై అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడులకు నష్టపరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేయగా, మరోవైపు ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ, దేశ న్యాయవ్యవస్థ చీఫ్ ఘోలమ్ హుస్సేన్ మొహ్సేనీ ఎజెయితో సమావేశమయ్యారు.

## మెగా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చెలరేగిన హింస



**ఇటానగర్, అక్టోబరు 25:** ఈశాన్యరాష్ట్రంలో ప్రతిపాదిత 11,200 మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. మధ్య ఈస్ట్ సియాంగ్ జిల్లాలో మూకలు ఎన్‌హెచ్‌పీసీ కార్యాలయాన్ని, పోలీసు స్టేషన్‌ను దగ్ధం చేయడంతో పాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సహా ఇద్దరు రాజకీయ నాయకుల నివాసాలపై దాడిచేసి ధ్వంసం చేసినట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. పాసిఘాట్‌లో నిరసనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారని ఆయన తెలిపారు.

## నితీశ్ వెళ్లిపోయారు..ఆపార్టీకూడా అంతే: అనంత్‌సింగ్

**పాట్నా, అక్టోబరు 25:** బీహార్‌లోని అధికార కూటమికి చెందిన జేడీ(యూ) నుంచి బహిష్కరణకు గురైన ఆ పార్టీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ తనపై వేటును చాలా తేలికగా తీసుకున్నారు. నితీశ్ కుమార్ వెళ్లిపోయారు, జేడీయూ కూడా అంతే అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీకి ఇక ఎలాంటి రాజకీయ భవిష్యత్తు లేదని ఆయన అన్నారు. బీహార్ శాసనమండలి ఎన్నికల సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎమ్మెల్యే అనంత్ సింగ్, ఆయన భార్యను జేడీ(యూ) నుంచి ఆరేళ్ల పాటు శనివారం బహిష్కరించారు.

26-10Pg7exHMNWJQE.qxd:26-10Pg7exHMNWJQE.qxd 1/1/02 6:38 AM Page 1



### పలాస-కాశీబుగ్గను రాష్ట్రంలోని టాప్10

# మున్సిపాలిటీల్లో నిలబెట్టడమే లక్ష్యం!



**శ్రీకాకుళం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మొగిలిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రసంగించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని రాష్ట్రంలోని టాప్10 మున్సిపాలిటీల్లో నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రైల్వే ఫ్లైఓవర్, కేంద్రీయ విద్యాలయం, ఇంటింటికీ తాగునీటి సౌకర్యం వంటి అభివృద్ధి అంశాలను మరియు పలాస అభివృద్ధే లక్ష్యం.

**టాప్10 మున్సిపాలిటీల్లో చోటే ధ్యేయం!**

పలాస-కాశీబుగ్గ,మొగిలిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రసంగించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, స్థానికంగా చేపట్టినట్లు పేర్కొన్న ప్రాజెక్టులు, భవిష్యత్తు లక్ష్యాలను ప్రస్తావిస్తూ ప్రజలకు పలు విజ్ఞప్తులు రామ్మోహన్ నాయుడు దృష్టి సారించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొంటూ స్థానిక ప్రజల ఆదరణ, సహకారం అభివృద్ధి కార్యక్రమాలకు కీలకమని వివరించారు. స్థానిక అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు ఒక అవకాశంగా అభివర్ణిస్తూ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి వంటి అంశాలు ప్రజలకు ముఖ్యమైనవని పేర్కొన్నారు.

# మూలపేట పోర్టు ప్రాంతంలో రసాయనిక పార్కు

- సుమారు రూ.1,500 కోట్లుతో ఎపిసిసి బృహత్తర ప్రణాళిక
- భవ్య రసాయన పథకం కింద రూ.1,000 కోట్లు గ్రాంట్



**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు పరిసర ప్రాంతాలను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు బృహత్తర ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా 2,000 ఎకరాల విస్తీర్ణంలో భారీ కెమికల్ పార్క్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పర్యావరణ తీరప్రాంత నియంత్రణ మండల అనుమతులను వేగవంతంగా జారీ చేస్తోంది. ఈ క్రమంలో రసాయన పార్కును ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసేందుకు ఈ నెలలోనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పార్కును 2,000 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది.ఈ పార్కుకు అవసరమైన ప్రధాన మౌలిక సదుపాయాల, కల్పన కోసం ఏపీఐఐసీ సుమారు రూ.1,500 కోట్లు ఖర్చు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన భవ్య రసాయన పథకం కింద రూ.1,000 కోట్లు గ్రాంట్‌గా లభించనున్నాయి. ములపేట ఓడరేవుతో అనుసంధానంగా ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు.నక్కపల్లిలో రూ.1,876.66 కోట్ల పెట్టుబడితో భారీ బల్క్ డ్రగ్ పార్కును కూడా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మొత్తం రూ.3,376 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ రెండు పారిశ్రామిక పార్కుల ద్వారా, సుమారు రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పార్కులో ఖియాంకర్ యూనిట్‌ఖి (ప్రధాన యూనిట్)గా వ్యవహరించే కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ప్రభుత్వం ఇప్పటికే 450 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ సంస్థ రూ.2,250 కోట్ల పెట్టుబడితో ఫాస్ఫోరిక్ యాసిడ్, ఎరువులు, ఇతర రసాయనాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. మరికొన్ని కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. ములపేట ఓడరేవులో వాణిజ్య కార్యకలాపాలు 2026 డిసెంబర్ నాటికి ప్రారంభం కానున్నాయి అనకాపల్లి జిల్లా, నక్కపల్లిలో 2,001 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ కోసం ప్రధాన మౌలిక సదుపాయాల మొదటి దశను పూర్తి చేసి, 2027 జూన్ నాటికి దానిని కార్యాచరణలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) లక్ష్యంగా పెట్టుకుంది. మౌలిక సదుపాయాల కోసం మొత్తం రూ.1,876.66 కోట్లు ఖర్చు చేయనుండగా, కేంద్ర ఔషధాల శాఖ రూ.1,000 కోట్ల గ్రాంటును అందిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని ఏపీఐఐసీ భరిస్తుంది. రూ.546.77 కోట్ల వ్యయంతో "ప్లగ్అండ్‌ప్లే" మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసే మొదటి దశ కాంట్రాక్టును ఇప్పటికే కేటాయించారు. ఈ దశలో యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఏపీఐలు), ఫెర్మెంటేషన్ కోసం ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేస్తారు.ఈ సదుపాయంలో ఆర్ డి ల్యాబ్‌లు, ఇంక్యుబేషన్ హబ్, వ్యర్థాల శుద్ధి యూనిట్ (రోజుకు 3 టన్నుల సామర్థ్యంతో), గిడ్డంగులు, ట్రక్కుల కోసం ప్రత్యేక లాజిస్టిక్స్ టెర్మినల్స్ ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఫార్మాస్యూటికల్ రంగంలోకి రూ.11,542 కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది

## 24 యేళ్లకే ఛైర్‌పర్సన్ పీఠం

- రాష్ట్రంలోనే అతిపిన్న వయస్కురాలిగా డాక్టర్ గాయత్రి



**రాజంపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే కడప జిల్లా రాజంపేట మున్సిపల్ ఛైర్మన్‌గా 24యేళ్లకే ఛైర్‌పర్సన్ పీఠంపై అతిపిన్న వయస్కురాలిగా డాక్టర్ దొంతం గాయత్రి రికార్డు సృష్టించారు. వైద్యురాలిగా ప్రజలకు సేవలం దించాల్సిన ఆమె. అనూహ్యంగా ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో కీలక పదవిని అందుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా 24యేళ్ల డాక్టర్ దొంతం గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోనే అతి పిన్న వయస్కురాలైన ఛైర్ పర్సన్‌గా ఆమె చరిత్ర సృష్టించనుంది. గాయత్రి తండ్రి దొంతం శివప్రసాద్ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన టిడిపి రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఉన్నారు. తండ్రి రాజకీయ వారసత్వంతో గాయత్రి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే వైఎస్సార్సీపి తరఫున దాఖలైన నామినేషన్లు సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో గాయత్రి ఎన్నిక ఏకగ్రీవమైంది.

## ఆర్యవైశ్యుల అండతోనే అనంతపురం అభివృద్ధి సాధ్యం

- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు టిజి భరత్ ,సత్యకుమార్ యాదవ్



**అనంతపురం , అక్టోబర్ 25,( ప్రభాత వార్త బ్యూరో):** అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర చాలా ఉందని, వారి సహకారంతోనే నగరాభివృద్ధి సాధ్యమని , ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలిస్తే ప్రధాని మోడీ చల్లని చూపు అనంతపురు పైన ఉంటుందని, ఢిల్లీ నుంచి నేరుగా నిధులు వస్తాయి అని రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్ ,టీజీ భరత్ వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పాతూరు అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ , మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ,మాజీ ఎమ్మెల్యేలు మధుసూదన్ గుప్తా, పార్థసారథి , బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ , ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు, ప్రతినిధులు, కూటమి పార్టీల కీలక నాయకులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, వాసవీ క్లబ్ ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, పాతూరు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మొదటి నుంచి కూటమి పార్టీల వెంటే నడుస్తున్నారని, ఇప్పుడు నగరంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎపిలో ఎన్నికల హింసపై డిజిపి అసహనం

- పార్టీలతో సంబంధం లేకుండా హింసకు పాల్పడిన వారిపై అత్యంత కఠిన చర్యలు

**విజయవాడ,అక్టోబరు 25, ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై డీజీపీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా13 జిల్లాల్లో 31 ఎన్నికల సంబంధిత ఘటనలు చోటుచేసుకోగా, వీటిలో 22 ప్రత్యక్ష హింసాత్మక ఘటనలు, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడానికి సంబంధించి మరో 9 ఘటనలు ఉన్నట్లు వెల్లడించారు..ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై తాజాగా డీజీపీ కార్యాలయం కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, వైసీపీ, సీపీఐఎంతో పాటు స్వతంత్ర అభ్యర్థులపై దాడులు జరిగినట్లు డీజీపీ పేర్కొన్నారు. ఎన్నికల హింసకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేయగా, మరో 11 ఘటనల్లో కేసుల నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు 54 మందికి పైగా నిందితులను గుర్తించామని, మిగతా వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నలుగురిని ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకోగా, ఇద్దరిపై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 170 కింద ముందస్తు నిరోధక చర్యలు చేపట్టినట్టు తెలిపారు..మూడు సందర్భాల్లో హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారని.. పోలీసు వాహనం పై దాడి చేసిన మూకను చెదరగొట్టే క్రమంలో రెండు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించినట్టు తెలిపారు. అలాగే అభ్యర్థులకు ఎస్కార్ట్‌గా వెళ్తున్న పోలీసు వాహనంపై రాళ్ల దాడి జరగడంతో ఓ కానిస్టేబుల్ తలకు గాయమైందని.. ఒకచోట గాల్లోకి కాల్పులు జరిపినట్లు కూడా డీజీపీ ప్రకటనలో పేర్కొన్నారు.నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించి వేయడం, ధ్వంసం చేయడం వంటి ఘటనలు మొత్తం 16 సార్లు జరిగాయని. రాళ్లు, కర్రలతో దాడులకు సంబంధించి ఆరు ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. ఈ దాడుల్లో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు కలిపి మొత్తం నాలుగు వాహనాలకు నిప్పుపెట్టారని చెప్పుకొచ్చారు.రెండు ఇళ్లపై దాడి చేయగా, ఒక ఇంటిని ఎర్త్‌మూవర్‌తో కూల్చివేశారని.. ఓ అభ్యర్థితో సహా ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో మూడు ఘర్షణల్లో పలువురు గాయపడ్డారని తెలిపారు. మూడు చోట్ల రాస్తారోకోలు, రోడ్ల దిగ్బంధం జరగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు.

## త్రిముఖ పోటీలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ పదవి

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. టిడిపి, వైఎస్ఆర్‌సిపి, కాంగ్రెస్ పార్టీల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. టిడిపి నుంచి రేష్మ పర్వీన్, వైఎస్ఆర్‌సిపి నుంచి ఫయాజ్‌బాష, కాంగ్రెస్ పార్టీ నుంచి మహమ్మద్‌అన్వర్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థి మహమ్మద్ అజాన్ ఫిరోజ్ బరిలో ఉన్నారు. ప్రధానంగా టిడిపి వైఎస్ఆర్‌సిపి అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. తాడిపత్రి మున్సిపాలిటీకి 48 వార్డు కౌన్సిలర్ స్థానాలు ఉండగా 30 వార్డులను టిడిపి ఏకగ్రీవం చేసుకుంది. 18 వార్డుల్లో వైఎస్ఆర్‌సిపి, టిడిపి, స్వతంత్రులు పోటీలో ఉన్నారు. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో వారి బౌతవ్యం వెల్లడయ్యే అవకాశం ఉంది. 18 వార్డు స్థానాలకు బరిలో ఉన్న అభ్యర్థులు. 3వ వార్డుకు మహమ్మద్ కసిఫ్ (టిడిపి), షేక్ సబ్బుర్ (వైఎస్ఆర్‌సివి), షేక్ హబీబా (ఇండిపెండెంట్) అభ్యర్థి పోటిలో ఉన్నారు. 4వ వార్డుకు మకందర్ రెహనా (వైఎస్ఆర్‌సిపి), షేక్ అబ్దుల్‌రహీం (టిడిపి), 9వ వార్డుకు అజయ్‌కుమార్ (వైఎస్ఆర్‌సిపి), విజయ్‌కుమార్ (టిడిపి), 10వ వార్డుకు కోమలి ఫరీదా (టిడిపి), గడ్డం ఓబులమ్మ (వైఎస్ఆర్‌సిపి), హారీఫాబేగం (ఇండిపెండెంట్), 11వ వార్డుకు ప్రణీత (టిడిపి), కృష్ణవేణి (సిపిఐ), 12వ వార్డుకు రాజా శిరీష (వైఎస్ఆర్‌సిపి), లక్ష్మీ దేవి (టిడిపి), 13వ వార్డుకు వసంత నరసింహారెడ్డి (వైఎస్ఆర్‌సిపి), రంగనాథ్‌రెడ్డి (టీడీపీ), 19వ వార్డుకు అంజనమ్మ (టిడిపి), చరిత (వైఎస్ఆర్‌సిపి), కృష్ణమ్మ (ఇండిపెండెంట్), 23వ వార్డుకు హబీబుల్లా (టిడిపి), ప్రతాప్‌యాదవ్ (వైఎస్ఆర్‌సిపి), 25వ వార్డుకు పోతుల గంగాధర్ (బిజెపి), బాష (వైఎస్ఆర్‌సిపి), మంజుల వెంకట యోగేష్ (ఇండిపెండెంట్), 27వ వార్డుకు లక్ష్మీ (టిడిపి), మల్యాల మొహసిన తరుణం (వైఎస్ఆ ర్‌సిపి), 30వ వార్డుకు ఎస్.అనురాధ (బిజెపి), టింకర్ సాను (వైఎస్ఆర్‌సిపి), కాకర్ల హసీనా బేగం (ఇండిపెండెంట్), అమృతవాణి (ఇండిపెం డెంట్), 36వ వార్డుకు జ్యోతి (టిడిపి), విజయ భాస్కర్ (వైఎస్ఆర్‌సిపి), 38వ వార్డుకు వెంకట సుబ్బమ్మ (టిడిపి), రంగమ్మ (వైఎస్ఆర్‌సిపి), శాంతి (ఇండిపెండెంట్), 39వ వార్డుకు అఖిల (టిడిపి), రామకృష్ణమ్మ (వైఎస్ఆర్‌సిపి), 42 వార్డు టకు మోహర్ హుస్సేన్ (టిడిపి), షేక్ సిలార్‌వలి (వైఎస్ఆర్‌సిపి), 46వ వార్డులో సం పంగి లక్ష్మీదేవి (వైఎస్ఆర్‌సిపి) శ్రీదేవి (టిడిపి) అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారందరూ ప్రచారం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటు న్నారు. మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శివరామకృష్ణ ఏకగ్రీవమైన వారికి డిక్లరేషన్ ఫారాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సాయికృష్ణ మృతి కేసులో కొనసాగుతున్న సిబిఐ విచారణ

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ మృతి కేసులో మూడో రోజు సీబీఐ విచారణ చేపట్టింది. సాయికృష్ణ మృతదేహం ఖననం చేశారని భావిస్తున్న కృష్ణలంక స్వర్గపురిలో సీబీఐ అధికారుల బృందం పరిశీలించింది. స్వర్గపురిలో పనిచేసే రవి, డేనియల్ సహా ముగ్గురిని విచారించింది. స్వర్గపురిలో రికార్డులు పరిశీలించింది. సుమారు గంటపాటు సిబ్బంది నుంచి కీలక వివరాలు సేకరించింది.ఇప్పటికే కేసులో కీలక నిందితులుగా భావిస్తున్న ఏ4 సురేశ్, ఏ7 వెంకటరాజు ఇళ్లల్లో సోదాలు చేసేందుకు కోర్టు అనుమతి కోరారు. న్యాయస్థానంలో సెర్చ్‌వారెంట్లకు సీబీఐ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కోర్టు అనుమతించింది దీంతో వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించేందుకు సిబిఐ సిద్ధమవుతుంది. సాయికృష్ణను కృష్ణలంక స్టేషన్‌లో ఉంచిన సమయంలోని దృశ్యాలు అక్కడి సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

# ఆర్థిక వ్యవస్థలు టార్గెట్‌గా సైబర్ దాడులు



**భువనేశ్వర్, అక్టోబరు 25:** ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణసంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశ వ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చుస్తాయని తెలిపారు. నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం అంతే ముఖ్యమని నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నా యన్నారు. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేమని ప్రధాని పేర్కొన్నారు. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుందని ప్రధాని అన్నారు. దేశ బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం ప్రపంచంలోనే సమర్థంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. ప్రజలకు రోజులో 24 గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులకు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. గతంలో బ్యాంకింగ్ సేవలు కొద్దిమంది సంపన్నులు, పలుకుబడి ఉన్నవారికే ఎక్కువగా పరిమితమయ్యాయని మోడీ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ధనికులకు రుణాలు సులభంగా లభించేవని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. 2014 తర్వాత సమతుల్య విధానాన్ని అనుసరించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో డెబిట్, క్రెడిట్ కార్డులు సామాన్యులకు అందని విలాస వస్తువులుగా ఉండేవని, ప్రస్తుతం అవి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గత పదేళ్లలో బ్యాంకింగ్ సేవలు అందని వర్గాలకు వాటిని చేరువ చేయడంపై దృష్టి సారించామని మోడీ చెప్పారు. ఇక రానున్న దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటిని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా చూడాలని అభిప్రాయ పడ్డారు. డిజిటల్ లావాదేవీల భద్రత, వేగవంతమైన సేవలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం భవిష్యత్తులో కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించిన ప్రధాని డిజిటల్ బ్యాంకింగ్ సేవల భద్రతను బలోపేతం చేయడం, సైబర్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని మోడీ అన్నారు. కొత్త సదుపాయాలు ఈ దిశగా ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఒడిశా అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. గనుల రంగం నుంచి మైక్రోచిప్‌ల తయారీ వరకు పలు రంగాల్లో రాష్ట్రం భవిష్యత్తును నిర్మించుకోగలదని అన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించే అనేక మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

# 121 పరుగుల తేడాతో జింబాబ్వేపై భారత్ ఘనవిజయం

### హార్మన్‌ప్రీత్, దీప్తిశర్మలు శతకాలతో జోరు




**వడోదర, అక్టోబరు 25:** జింబాబ్వేతో జరుగుతున్న రెండో వన్డేలో భారత మహిళల జట్టు జోరు కొనసాగించింది. బ్యాటింగ్‌లో హార్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ శతకాలతో చెలరేగగా.. బౌలింగ్‌లోనూ సత్తాచాటి జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ 121 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి 207 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకొని మూడు వన్డేల సిరీస్‌లను 20తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలో ఎదురుదెబ్బలు తగిలాయి. స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) త్వరగానే పెవిలియన్ చేరారు. ఈ దశలో కెప్టెన్ హార్మన్‌ప్రీత్ కౌర్, ప్రతికా రావల్ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 124 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రతికా రావల్ అర్ధశతకం సాధించి 70 పరుగుల వద్ద వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మ హార్మన్‌ప్రీత్‌తో కలిసి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 153 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హార్మన్‌ప్రీత్ 121 బంతుల్లో 126 పరుగులు చేయగా దీప్తి శర్మ 86 బంతుల్లో 106 పరుగులతో అజేయంగా నిలిచింది. దీప్తి తన వన్డే కెరీర్‌లో రెండో శతకాన్ని నమోదు చేసింది. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వన్డేల్లో శతకం సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా నిలిచింది. వీరిద్దరి భాగస్వామ్యం భారత్ భారీ స్కోరు సాధించడంలో కీలకంగా మారింది. 329 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు మోడెస్టర్ ముపాచిక్వా, లోరిన్ ఫిరి శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 38 పరుగులు జోడించిన తర్వాత ఫిరి 6 పరుగులకు ఔటైంది. అనంతరం ముపాచిక్వా, చిపో ముగేరితిరిపానో రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముపాచిక్వా 49 పరుగుల వద్ద వెనుదిరగడంతో జింబాబ్వే కీలక వికెట్ కోల్పోయింది. ముగేరితిరిపానో 46 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. వైష్ణవి శర్మ 39 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ మూడు వికెట్లతో రాణించింది.దీంతో జింబాబ్వే 207 పరుగులకే పరిమితమైంది. భారత మహిళల జట్టు 121 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో గ్యాంగ్ వార్

- ఎపి రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎలక్షన్లు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేసారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు. రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆరోపించారు.ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే. బీహార్‌ను మించి పోయి, రెండు కుటుంబాలకు చెందిన ఒక హిందూ కుల గ్యాంగ్, మరో మైనారిటీ మతానికి చెందిన గ్యాంగ్‌లు మన రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయి" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రెండు కుటుంబ గ్యాంగులకు అధికారం దక్కకుండా చేస్తే తప్ప ఏపీలో ప్రజలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి కేవలం మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ వలనే సాధ్యమవుతుందని, అదే ఏపీకి శరణ్యమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు.ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు.. ఈ ముగ్గురు కలిసి ఒక కూటమిగా ఏర్పడి, స్థానిక ఎన్నికల్లో పోటీపడి నామినేషన్లు చించేస్తున్నారు" అని విమర్శించారు. 2021లో వైసీపీ చేసిన అరాచకం కంటే పదింతలు ఎక్కువ అరాచకం ఈ రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# నీటికుంటలో మునిగి ముగ్గురు మృతి

### కుమార్తెను కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన తల్లి

### రక్షించేందుకు వెళ్లిన మరో మహిళ కూడా మృతి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని చెరువు పక్కన ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు మునిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మృతులను మణెమ్మ (24), కీర్తన (16), కావ్య (9) గా గుర్తించారు. బట్టలు ఉతికేందుకు వెళ్లిన సమయంలో జరిగిన ఈ దుర్ఘటనలో 14 ఏళ్ల బాలికతో పాటు ఆమె తల్లి, మరో మహిళ మృత్యువాత పడటం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కళ్లముందే జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబాల్లో కన్నీరుమున్నీరుగా విలపించే పరిస్థితి నెలకొంది. ఒకే ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో ఇందారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోజువారీ పనుల్లో భాగంగా ఆదివారం బట్టలు ఉతికేందుకు ముగ్గురు మహిళలు గ్రామ సమీపంలోని చెరువు పక్కన ఉన్న నీటికుంట వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో 14 ఏళ్ల బాలిక ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయింది. చిన్నారి నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన ఆమె తల్లి తీవ్ర ఆందోళనకు గురై, కుమార్తెను ఎలాగైనా కాపాడాలనే ఆతృతతో నీటిలోకి దిగింది. అయితే, కుమార్తెను రక్షించే ప్రయత్నంలో తల్లి కూడా నీటిలో మునిగిపోయింది.

తల్లి, కుమార్తె నీటిలో మునిగిపోతుండటాన్ని గమనించిన మరో మహిళ వారిని రక్షించేందుకు ప్రయత్నించింది. అయితే, ఆమె కూడా నీటిలో మునిగిపోయింది. ఇలా ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించిన క్రమంలో ముగ్గురూ ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరంగా మారింది. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి, తదుపరి చర్యల్లో భాగంగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మోడీ తండ్రి కూడా వెళతారు...

# ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

**పాట్నా, అక్టోబరు 25:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర వివాదాస్పదంగా మారాయి. పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో మోడీ తండ్రి కూడా వెళ్తారు అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో బీజేపీ నేతలు కాంగ్రెస్, రాహుల్ గాంధీ, ఖర్గేలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రధాని కుటుంబంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే అన్ని మర్యాద హద్దులు దాటారని విమర్శించారు. కాంగ్రెస్ విధానపరమైన అంశాలపై మాట్లాడేందుకు ఏమీ లేకపోవడంతో తిట్ల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన అమిత్ షా ప్రధాని మోడీని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ గతంలో కూడా వ్యాఖ్యలు చేసిందని, గతంలో మోడీని మృత్యు వ్యాపారిఅని, ఆయన పేదరికాన్ని ప్రస్తావిస్తూ టీ అమ్మేవాడంటూ ఎగతాళి చేశారని ఆరోపించారు. వరస ఎన్నికల్లో ఓటములతో కాంగ్రెస్ నిరాశకు గురైందని, ప్రధాని కుటుంబంపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు ప్రతీసారి ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని అన్నారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఖర్గే వ్యాఖ్యల్ని తప్పుపట్టారు. బహిరంగ వేదికపై మర్యాదకు విరుద్ధమైన భాషను వాడారని, ఇది కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు హుందాతనం, సంయమనం పాటించాలని అన్నారు. మరణించిన వ్యక్తుల్ని రాజకీయ ప్రసంగాల్లోకి లాగడం సరైన పద్ధతి కాదని, ఖర్గే వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. మాజీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా ఖర్గే వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి పట్ల గౌరవం, మర్యాద పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. విధానాలు, ఆలోచనల ఆధారంగా రాజకీయంగా పోటీపడలేక కాంగ్రెస్ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. అంతకుముందు పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఓ వ్యక్తి మోడీ వెళ్లరు అని ఆయన అధికారంలోనే ఉంటారనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఇదే కాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియపై విమర్శలు చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకు ఆపార్టీ కార్యకర్తలు యువకుడిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# టిజి ఐపాస్ డేటా సేఫ్ .. పోర్టల్ పునరుద్ధరణ విజయవంతం

### సైబర్ నేరస్థుల నుంచి పోర్టల్ తిరిగి నియంత్రణలోకి

**హైదరాబాద్,అక్టోబరు25,ప్రభాతవార్త:** సైబర్ దాడికి గురైన తెలంగాణ పారిశ్రామిక అనుమతుల పోర్టల్‌టీజీఐపాస్‌ను అధికారులు విజయవంతంగా పునరుద్ధరించారు. సైబర్ నేరస్థుల నుంచి పోర్టలు తిరిగి తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పోర్టల్లోని సమాచారం సర్వర్‌లో భద్రంగానే ఉందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సైబర్ భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ ఫైర్వాల్స్, అదనపు భద్రతా చర్యలతో పోర్టల్ను తీర్చిదిద్ది రెండు రోజుల్లో తిరిగి అందుబాటులోకి తీసుకురానున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న పోర్టల్పై సైబర్ దాడి జరిగిన నేపథ్యంలో అధికారులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.

పారిశ్రామిక పెట్టుబడులు, అనుమతుల ప్రక్రియలో కీలకమైన టీజీఐపాస్ సేవలకు అంతరాయం కలగడంతో అధికారులు పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశారు. పోర్టల్ భద్రతను మరింత బలోపేతం చేసిన అనంతరం సేవలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ దాడికి దారితీసిన పరిస్థితులు, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులను నివారించే చర్యలపై కూడా దృష్టి సారించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన గవర్నమెంట్ టు బిజినెస్ (జి2బి) సేవల్ని అందించే టీజీఐపాస్‌పై సైబర్ దాడి చోటుచేసుకోవడం చర్చ నీయాంశంగా మారింది. పోర్టల్ సర్వర్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు... దాని డేటాబేస్‌ను కూడా ఎన్‌క్రిప్ట్ చేశారు. అక్టోబరు 22న రాత్రి 11.36 గంటలకు సైబర్ దాడి జరగడంతో పోర్టల్ అప్లికేషన్ నిలిచిపోయింది. మొదటి రెండు రోజులు దీనిని సరిచేయడానికి టెక్నికల్ టీమ్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. సర్వర్ రీస్టార్ట్ చేయడానికి క్లౌడ్4సీ సంస్థ సహకారం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం జరిపిన పరిశీలనలో ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఆ సర్వర్ పునరుద్ధరణకు క్లౌడ్4సీ సంస్థను కోరినా కుదరలేదు. ఈ క్రమంలోనే సర్వర్ హ్యాక్ అయినట్లు నిర్ధారణకు వచ్చారు.

# ఫ్రెంచ్ ఓపెన్‌లో సింధు ఓటమి



**పారిస్:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సూపర్ 750 టోర్నమెంట్ అయిన బీడబ్ల్యూఎఫ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో ఓటమిపాలైంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన ఆమె, దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నంబర్ 1 అన్ సే యంగ్ చేతిలో ఓడిపోయింది. సింధు ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ చేతిలో 21-16, 11-21, 12-21 తేడాతో పరాజయ చెందింది. సింధు బలంగా ప్రారంభించి తొలి గేమ్‌ను 21-16 తేడాతో గెలుచుకుంది. కానీ రెండో, మూడో గేమ్‌లలో అన్ సే తన విజృంభణను ప్రదర్శించి సింధు పై తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అంతకు ముందు సింధు సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన హినా అకేచిని 21-10, 20-22, 21-16 తేడాతో ఓడించి, తన తొలి ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోరుకు చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరిగిన తన ప్రచారంలో, ఆమె థాయ్‌లాండ్‌కు చెందిన సుపానిడా కటెథాంగ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన తొలిరౌండ్ పోరులో గెలిచి, ఆ తర్వాత జపాన్‌కు చెందిన రికో గుంజి, చైనీస్ తైపీకి చెందిన చియు పిన్‌చియాన్‌లను వరుస గేమ్‌లలో ఓడించింది. 2026లో 651 అనే అద్భుతమైన గెలుపుఓటముల రికార్డుతో ఆన్ సే యంగ్ ఆదివారం నాటి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఫైనల్‌లో ఈ విజయంతో, ఆమె ప్రస్తుతం 50 మ్యాచ్‌ల విజయ పరంపరలో ఉంది. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ మినహా, ఈ ఏడాది ఆమె ఆడిన అన్ని టైటిల్ పోరులలోనూ విజయం సాధించింది.

# నింగ్బో ఛాంపియన్‌గా రైబాకినా



**నింగ్బో:** ప్రపంచ నంబర్ 1 ఎలెనా రైబాకినా, ఆదివారం ఇక్కడి సెంటర్ కోర్టులో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో కెనడాకు చెందిన లేలా ఫెర్నాండెజ్‌ను ఓడించి తన నింగ్బో ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకుని ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది తన నాలుగో టైటిల్ కోసం ఫెర్నాండెజ్‌ను 6-2, 6-2 తేడాతో ఓడించడానికి రైబాకినాకు 1 గంట 16 నిమిషాలు పట్టింది. ఈ మ్యాచ్‌లో ఆమె ప్రపంచ 30వ ర్యాంకర్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది, రెండు సెట్లలోనూ రెండేసి సార్లు బ్రేక్ సాధించి నింగ్బోలో వరుసగా రెండో టైటిల్‌ను గెలుచుకుంది. మొదటి సెట్ ప్రారంభంలో వరుస బ్రేక్ పాయింట్లను కాపాడుకోవలసి రావడంతో కజఖ్ క్రీడాకారిణికి కొంత సవాలు ఎదురైంది. అయినప్పటికీ, ఆమె అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఆ తర్వాత వరుసగా ఐదు గేమ్‌లను గెలుచుకుని మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో కూడా రైబాకినా మంచి ఫామ్‌లో ఉండి, తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి రెండవ సెట్‌లో ఫెర్నాండెజ్ సర్వీస్‌ను రెండుసార్లు ఒకసారి మూడవ గేమ్‌లో, ఆపై ఏడవ గేమ్‌లో బ్రేక్ చేసి, ఆ తర్వాత మ్యాచ్‌ను సునాయాసంగా గెలుచుకుంది.

## అల్మటీ ఓపెన్‌లో భాంబ్రీ-ర్యాన్

# డబుల్స్ జోడీకి టైటిల్

**అల్మాటీ:** ఆదివారం జరిగిన ఉత్కంఠభరితమైన మూడు సెట్ల పోరులో టాప్ సీడెడ్ ఆస్ట్రియన్ జంట లూకాస్ మిడ్లర్-నీల్ ఓబర్‌లీట్నర్‌లను ఓడించి, భారత ఆటగాడు యూకీ భాంబ్రి-అమెరికన్ ర్యాన్ సెగర్‌మాన్ జోడీ ఏటీపీ 250 అల్మాటీ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. భారత, అమెరికన్ ద్వయం అల్మాటీ అరీనాలో 7-6(3), 6-7(1), (10-2) తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. మొదటి సెట్ హోరాహోరీగా సాగింది, ఇరు జట్లు తమ సర్వ్‌లను నమ్మకంగా నిలబెట్టుకున్నాయి. చివరకు ఆ సెట్ టైబ్రేక్‌లో నిర్ణయించబడింది, అందులో భాంబ్రి-సెగ్గర్‌మాన్ జంట 7-3 తేడాతో విజయం సాధించింది.

రెండో సెట్‌లో ఆస్ట్రియన్ జంట పుంజుకుని మ్యాచ్‌ను సమయం చేసింది. టైబ్రేక్‌లో 7-1తో ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక మ్యాచ్‌కు దారితీసింది. మ్యాచ్ టైబ్రేక్ ప్రారంభ పాయింట్ల నుంచే భంబ్రి-సెగ్గర్‌మాన్ ఆధిపత్యం చెలాయించి, అద్భుతమైన ప్రదర్శనతో 10-2 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ మ్యాచ్ ఒక గంట 26 నిముషాల పాటు సాగింది. ఈ పోరులో భారత్, అమెరికన్ జోడీ ఆరు ఏస్‌లు సాధించి, కేవలం ఒక డబుల్ ఫాల్ట్ మాత్రమే చేసింది. ఆస్ట్రియన్ ప్రత్యర్థులు మూడు ఏస్‌లు, ఒక డబుల్ ఫాల్ట్ నమోదు చేశారు.



ఆట







# మరోసారి భారత్, పాక్ పోరు

## నవంబరు 22న దాయది దేశాల ఢీ

**న్యూఢిల్లీ:** క్రికెట్ లోకంలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భారత్, పాకిస్తాన్ జట్లు మరోసారి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాయి. పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్, 2026 టోర్నమెంట్ షెడ్యూల్‌ను ఏషియన్ క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) అధికారికంగా విడుదల చేసింది. దౌహ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో ఇండియా ఏ, పాకిస్తాన్ ఏ జట్లు ఒకే గ్రూపులో చోటు దక్కించుకున్నాయి. ఈ టోర్నీలో భారత్ తన మొదటి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది.

ఆ తర్వాత నవంబర్ 22న వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది. గ్రూప్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌ను నవంబర్ 24న యూఏఈతో ఆడనుంది. ఈ టోర్నీలో మొత్తం 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఏ లో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ ఉన్నాయి. అలాగే గ్రూప్ బీ లో ఇండియా, పాకిస్తాన్, నేపాల్, యూఏఈ స్థానం సంపాదించాయి. ప్రతీ జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. రెండు గ్రూపులు నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్ మ్యాచ్‌లు నవంబర్ 26, 27 తేదీల్లో జరగనున్నాయి.

గత 2025 ఎడిషన్‌లో ఇండియా జట్టుకు జితేష్ శర్మ నాయకత్వం వహించాడు. ఆ టోర్నీలో యూఏఈపై 148 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి భారత్ శుభారంభం చేసినప్పటికీ, పాకిస్తాన్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. అనంతరం ఒమన్ పై గెలిచి సెమీఫైనల్ చేరిన భారత్, సెమీస్‌లో బంగ్లాదేశ్ తో జరిగిన టై మ్యాచ్‌లో సూపర్ ఓవర్ ద్వారా ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు పాకిస్తాన్ సెమీస్‌లో శ్రీలంకపై గెలిచి, ఫైనల్లో బంగ్లాదేశ్‌ను సూపర్ ఓవర్లో ఓడించి విజేతగా నిలిచింది. ఈ సారి 2026 ఎడిషన్‌లో భారత్ పాత పరాజయాన్ని మర్చిపోయి కప్‌ను గెలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

## ఫీఫా ప్రపంచ కప్‌లో కామెరూన్‌ను

# ఓడించిన భారత్

## రెండో మ్యాచ్‌లోనూ విజయం

**బాకు:** తొలి ఫీఫా అండర్15 ప్రపంచ కప్ ఫెస్టివల్ అజర్‌బైజాన్ 2026 లో భారత్ తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఆదివారం నాడు బాకులో జరిగిన తమ రెండవ గ్రూప్ మ్యాచ్‌లో కామెరూన్‌ను 2-1 తేడాతో ఓడించింది. ఇప్పటివరకు ఆడిన రెండు గ్రూప్ మ్యాచ్‌లలోనూ గెలిచిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది.

వర్షం కురుస్తున్నప్పటికీ, బ్లూ కోల్ట్స్ తమ ప్రభావాన్ని చూపారు. మొదటి నిమిషంలోనే దీపక్ సింగ్ అరాంబం కొట్టిన కార్నర్ కిక్ కామెరూన్ బాక్స్‌లో గందరగోళానికి కారణమైంది. కామెరూన్ క్రమంగా ఒత్తిడిని పెంచినప్పటికీ, భారత్ సరైన సమయంలో స్లైడింగ్ టాకిల్స్ చేస్తూ తమ ఆధిక్యాన్ని నిలుపుకుంది. 14వ నిమిషంలో బిబియానో ఫెర్నాండెజ్ బృందం తమ ఆధిక్యాన్ని దాదాపు రెట్టింపు చేసుకుంది. తర్వాత జెనిత్ వరుసగా కీలకమైన సేవ్‌లు చేసి భారత్‌ను ఆదుకున్నాడు. దీపక్ (19వ) కొట్టిన షాట్ సైడ్ నెట్టింగ్‌లోకి వెళ్లింది. అయితే, కామెరూన్ (20వ) స్కోరును సమం చేసింది. మోక్తార్ ఇచ్చిన క్రాస్ మహమ్మద్ సోహిల్ ఖాన్‌కు తగిలి నెట్‌లోకి వెళ్లడంతో ఓన్ గోల్ నమోదైంది. రెండవ అర్ధభాగంలో లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా తొలి ప్రయత్నంలోనే భారతదేశానికి తిరిగి ఆధిక్యాన్ని అందించాడు. కామెరూన్‌కు (31వ) పెనాల్టీ లభించినా (32వ) హరూనా అబ్దులాయే కొట్టిన స్పాట్‌కిక్‌ను ఆపి, భారత్ ఆధిక్యాన్ని నిలబెట్టాడు. ఆట చివరి దశలలో బ్లూ కోల్ట్స్ తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. భారత్ తమ ఆటతీరును కాపాడుకుంటూ మ్యాచ్‌ను ముగించి వరుసగా రెండో విజయాన్ని కైవసం చేసుకుంది.




# వెండి ధరలు భారీగా పతనం

## కిలో రూ.4.2 లక్షల నుంచి రూ.1.9 లక్షలకు డౌన్



**ముంబయి, అక్టోబరు 25:** బంగారం, వెండి వంటి విలువైన లోహాల మెరుపు తగ్గుతోంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలు, మధ్యప్రాచ్యంలో మళ్లీ తీవ్రతరమవుతున్న ఘర్షణలు, అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై నెలకొన్న అంచనాలు ఈ లోహాల ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయి. గత వారం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం స్పాట్ ధర ఔన్సుకు 3,989.10 నుంచి 3,993.96 డాలర్ల స్థాయికి పడిపోయింది. అనంతరం కొంత కోలుకుని 4,026 డాలర్లకు చేరినప్పటికీ, రోజులో జరిగిన నష్టాల్లో ఎక్కువ భాగాన్ని భర్తీ చేసుకున్నా ధరలపై ఒత్తిడి కొనసాగింది. మరోవైపు, వెండి ధరల పతనం మరింత తీవ్రంగా ఉంది. ఔన్సుకు 120 డాలర్ల స్థాయి నుంచి 53.8 డాలర్లకు పడిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ నష్టాలు నమోదయ్యాయి. ఈ పరిణామాల ప్రభావంతో భారతదేశంలో ఎంసిఎక్స్ మార్కెట్‌లో వెండి ధర కిలోకు సుమారు రూ.4.2 లక్షల స్థాయి నుంచి రూ.1.9 లక్షలకు దిగివచ్చింది. సురక్షిత పెట్టుబడులుగా భావించే ఆస్తులకు కొంత మద్దతునిచ్చినప్పటికీ, మార్కెట్లలో అనిశ్చితి పెరిగిన సమయాల్లో బులియన్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అధికమైందని కోటక్ నియోకు చెందిన కమోడిటీ రీసెర్చ్ విభాగం ఎవిపి కైనత్ చైన్‌వాలా పేర్కొన్నారు. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే, వెండితో పోలిస్తే బంగారం మెరుగైన స్థితిలో ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వెండికి పారిశ్రామిక రంగం నుంచి గణనీయమైన డిమాండ్ ఉండటంతో, ఆర్థిక పరిస్థితులు మరింత ప్రతికూలంగా మారితే ధరలు లోతైన దిద్దుబాటుకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో వెండి ధర ఔన్సుకు 50 డాలర్ల దిగువకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1.9 లక్షల కంటే దిగువకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారుల దృష్టి ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశంపై ఉంది. వడ్డీ రేట్ల పెంపు ప్రక్రియకు విరామంలభిస్తే, బంగారం, వెండి ధరలపై ఉన్న కొంత ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. ఈ నెలలో బంగారం, వెండి రెండింటిపైనా నిరంతర అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోందని కమోడిటీ నిపుణులు పేర్కొంటున్నారు. అక్టోబర్‌లో అమెరికా వడ్డీ రేట్ల పెంపు జరిగే అవకాశం 10 శాతం కంటే తక్కువగా మార్కెట్లు అంచనా వేస్తున్నప్పటికీ, ముడి చమురు ధరలు పెరగడం మళ్లీ ద్రవ్యోల్బణ భయాలను పెంచుతోంది. దీంతో అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలోనే కొనసాగవచ్చనే అంచనాలు బలపడుతున్నాయి. ఈపరిణామాలు బంగారం, వెండి ధరలకు ప్రతికూలంగా మారవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో దాడులు చమురు సరఫరా సాధారణ స్థితికి చేరే అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న చమురు మార్కెట్‌లో ధరలు మరింత పెరిగే పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

# గడువు అనంతరం ఎఫ్‌డిలు తీసుకోకపోతే సమస్యే

**ముంబయి, అక్టోబరు 25:** ఫిక్స్‌డ్ డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత కూడా డబ్బులు తీసుకోకపోతే ఏం జరుగుతుందనే దానిపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ కొన్ని స్పష్టమైన నిబంధనలు రూపొందించింది. సాధారణంగా ఎఫ్‌డి కాల పరిమితి పూర్తి కాగానే ఖాతాదారుడికి డబ్బులు అందాలి. కానీ చాలాసార్లు సమాచారం లేకపోవడం వల్ల అలా జరగదు. ఎఫ్‌డి ఖాతా తెరిచే సమయంలోనే ఆటోరెన్యూవల్ ఆప్షన్ ఎంచుకుంటే, బ్యాంకు నిబంధనల ప్రకారం ఆ డిపాజిట్ మళ్లీ రెన్యూవల్ అవుతుంది. ఒకవేళ డబ్బులు నేరుగా ఖాతాలో జమ అయ్యేలా ఉంటే ఆ ప్రక్రియ జరుగుతుంది. గడువు తీరిన తర్వాత కూడా ఎఫ్‌డి డబ్బులు తీసుకోకపోతే, ఆ మొత్తంపై వడ్డీ విషయంలో కొన్ని మార్పులు ఉంటాయి. పాత ఎఫ్‌డికి ఇస్తున్న వడ్డీయే ఎప్పటికీ కొనసాగుతుందనిచెప్పలేం. సాధారణ సేవింగ్స్ ఖాతా వడ్డీ లేదా గడువు ముగిసిన ఎఫ్‌డిపై వర్తించే వడ్డీ రేట్లలో ఏది తక్కువగా ఉంటే ఆ మొత్తమే లభిస్తుంది. ఒకవేళ ఎఫ్‌డి మెచ్యూరిటీ తేదీ నుంచి పది సంవత్సరాల వరకు ఎలాంటి క్లెయిమ్ చేయకపోతే, ఆడబ్బును అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్‌గా పరిగణిస్తారు. పదేళ్లు పూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలోని డిఇఎ ఫండ్‌కు బ్యాంకులు బేలన్స్ చేసి బదిలీ చేస్తాయి. డిపాజిట్ చేసిన సొమ్ము ఎప్పటికైనా ఖాతాదారుడికే చెందుతుందని గమనించాలి. ఖాతాదారుడు లేదా చట్టపరమైన వారసులు ఎప్పుడైనా సంబంధిత బ్యాంకును సంప్రదించి, సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఆ డబ్బును తిరిగి పొందవచ్చు. ఒకవేళ ఖాతాదారుడు మరణిస్తే, నామినీ లేదా చట్టపరమైన వారసులు డెత్ సర్టిఫికెట్, గుర్తింపు పత్రాలు సమర్పించి క్లెయిమ్ చేసుకోవచ్చు. ఎఫ్‌డిని తిరిగి రెన్యూవల్ చేసే ముందు ప్రస్తుత వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి, డబ్బు ఎప్పుడు అవసరమవుతుంది అనే విషయాలను బేరీజు వేసుకోవడంమంచిది. భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా కుటుంబ సభ్యులకు ఎఫ్‌డి వివరాలు, నామినీ సమాచారం ఎప్పుడూ అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యం.

# ఈవారం మార్కెట్లలో ఇన్వెస్టర్లకు జోష్




**ముంబయి, అక్టోబరు 25:** భారతీయ ఈక్విటీ మార్కెట్లలో పలు కంపెనీలు డివిడెండ్లు ప్రకటన స్టాక్ విభజనలు చేస్తున్నాయి. ఎల్ అండ్ టి టెక్నాలజీ, శ్రీరామ్ ఫైనాన్స్, క్రిసిల్ వంటి దిగ్గజ కంపెనీలతో సహా దాదాపు 24 సంస్థలు తమ కార్పొరేట్ చర్యల్లో భాగంగా ఎక్స్ రికార్డ్ తేదీకి సిద్ధమవుతున్నాయి. పలు కంపెనీలు తమ వాటాదారులకు అదనపు ఆదాయాన్ని అందించేందుకు మధ్యంతర డివిడెండ్లను ప్రకటిస్తుండగా మరికొన్ని సంస్థల షేర్ల విభజన లేదా బోనస్ షేర్ల కేటాయింపులను అమలు చేస్తున్నాయి. ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్న కంపెనీల్లో ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ మొదటి వరుసలో ఉంది. ఒక్కో షేరుపై రూ.20 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి సంబంధించిన ఎక్స్ డేట్, రికార్డ్ తేదీగా ఈనెల 27ను నిర్ణయించింది. దీంతో పాటు అనంతమ్ హైవేస్ ట్రస్ట్ సైతం డివిడెండ్ ఎక్స్ రికార్డ్ తేదీ ఇదే రోజు ఉంది. హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీ రూ.9.50 చొప్పున డివిడెండ్ చెల్లిస్తుండగా, రికార్డ్ తేదీగా ఈనెల 26ను నిర్ణయించింది. శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సెక్టార్ నుంచి డివిడెండ్ ఇస్తోంది.

ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.6.50 చొప్పున డివిడెండ్ చెల్లించనుంది. నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్మెంట్, సైయంట్ కంపెనీలు డివిడెండ్ చెల్లిస్తున్నాయి. నిప్పాన్ ఇండియా ఎఎంసి ఒక్కో షేరుకు రూ.9.50 చొప్పున ఇస్తుండగా సైయంట్ ఒక్కో షేరుకు రూ.12 ,రేటింగ్ సంస్థ క్రిసిల్ రూ.17 చొప్పున డివిడెండ్‌లు ప్రకటించాయి. ఇక చెన్నై పెట్రోలియం ఒక్కో షేరుపై రూ.25 చొప్పున డివిడెండ్ చెల్లిస్తోంది. కేసాల్వ్స్ ఇండియా రూ.1 చొప్పున డివిడెండ్ ఇస్తోంది. అడోర్ వెల్డింగ్ ఒక్కో షేరుకు రూ.7.50, స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ రూ.1.50 చొప్పున, అంవిల్ హెల్త్ కేర్ రూ.0.50 చొప్పున, హైపర్ టెక్నాలజీస్ రూ.0.25 చొప్పున, సగిలిటి రూ.0.15 చొప్పున, డిసిఎం శ్రీరామ్, రెయిల్ టెల్ కార్పొరేషన్లు ఎక్స్ డివిడెండ్ రికార్డ్ తేదీగా ఈనెల 30ని నిర్ణయించాయి. మిడాస్ ఫ్యాషన్స్ కంపెనీ 1:2 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపడుతోంది

ఇండియన్ ఎమల్సిఫయర్స్, మ్యాగ్నమ్ స్టీల్ అండ్ ఇన్‌ఫ్రా కంపెనీలు తమ రైట్స్ ఇష్యూకు రికార్డ్ తేదీగా ఈనెల 27ను నిర్ణయించాయి.అర్బన్ ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ తమ రైట్స్ ఇష్యూ 1:1 రేషియోలో అందించేందుకు రికార్డ్ తేదీని ఈనెల 28గా నిర్ణయించింది. చాందిని మెషీన్స్ కంపెనీ 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేస్తోంది. వీటితో పాటు గెలాక్సీ అగ్రికో ఎక్స్‌పోర్ట్స్, మీనాక్షీ ఇండియాలు సైతం స్టాక్ స్ప్లిట్ చేస్తున్నాయి.

# భారత్ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల భారీ విత్‌డ్రాలు

## ఈనెలలో ఇప్పటివరకు రూ.48,056 కోట్ల పెట్టుబడులు వెనక్కి



**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులు విత్‌డ్రా చేసారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అధికస్థాయిలో కొనసాగడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అక్టోబర్‌లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐలు) రూ.48,056 కోట్లను వెనక్కి తీసుకున్నారు. గత వారం విదేశీ మదుపరుల అమ్మకాల ఒత్తిడి గణనీయంగా తగ్గింది.

రెండు ట్రేడింగ్ రోజుల్లో వారు నికర కొనుగోలు దారులుగా మారడం కొంత ఊరటనిచ్చింది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో ఎఫ్‌పీ ఐలు రూ.35,861 కోట్ల పెట్టుబడులను ఉప సంహరించుకున్నారు. అంతకుముందు జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్ల పెట్టుబడులు పెట్టారు. తాజా ఉపసంహరణలతో 2026లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుంచి ఎఫ్‌పిఐలు వెనక్కి తీసుకున్న మొత్తం రూ.3.08 లక్షలకోట్లకు చేరింది. చాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ మాట్లాడుతూ, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు సుమారు 114 డాలర్లకు చేరడం, కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు, దేశీయ ద్రవ్య లభ్యతపై అనిశ్చితి వంటివి విదేశీ మదుపరుల అమ్మకాలకు కారణమని తెలిపారు.

జియో ప్లాట్‌ఫామ్స్‌కుసంబంధించిన రూ.30,213 కోట్ల ఐపిఒ కూడా తాత్కాలికంగా మార్కెట్‌లోని నిధుల లభ్యతపై ప్రభావం చూపిందని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుల కేటాయింపుల్లో మార్పులు భారత ఈక్విటీలపై ఒత్తిడిని పెంచాయని వివరించారు. మీరామనీ సహ వ్యవస్థాపకుడు ఆనంద్ కే.రాఠీ మాట్లాడుతూ, ముడి చమురుధరలుఅధిక స్థాయిలో కొనసాగడం, కంపెనీల భవిష్యత్ ఆదాయాలపై ఆందోళనల కారణంగా విదేశీ మదుపరులు పెట్టు బడులను ఉపసంహరించుకుంటున్నారని పేర్కొ న్నారు. ఈ నెల 23తో ముగిసిన వారంలో ఎఫ్‌పి ఐలు తమ అమ్మకాలను గణనీయంగా తగ్గించ డంతో పాటు రెండు రోజులు నికర కొనుగోలు దారులుగా మారారు.



# కృత్రిమ మేధతో గ్లోబల్ ఎకానమీకి యేటా 2.52 ట్రిలియన్ డాలర్లు: మెకిన్సే

**ముంబయి, అక్టోబరు 25:** కృత్రిమ మేధ (ఎఐ) ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పనులను ఆటోమేషన్ చేయడం, ఉద్యోగులకు సహకరించడం ద్వారా యేటా 2.52 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక విలువను సృష్టించే అవకాశం ఉందని మెకిన్సే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. యేఐ సాంకేతికత అమలుకు అయ్యే ఖర్చులు పెరిగితే ఈ ప్రయోజనాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ది ఎఐ వాల్యూ కర్వ్,ది ఎకనామిక్స్ ఆఫ్ అప్లయింగ్ ఎఐ టు ఎగ్జిస్టింగ్ వర్క్ పేరుతో విడుదలైన ఈ నివేదికలో, ఎఐ స్వీకరణ పెరుగుతున్నప్పటికీ, దాని ద్వారా వాస్తవంగా ఎంత ఆర్థిక ప్రయోజనం లభిస్తోందనే విషయంలో అంతరం పెరుగుతోందని పేర్కొంది. అనేకసంస్థలు ఎఐసాంకేతికతను అమలు చేయడం పైనే దృష్టి సారిస్తున్నాయని, దాని ద్వారా లభించే ప్రయోజనాలను అంచనా వేయడంపై తగిన శ్రద్ధ చూపడం లేదని అధ్యయనం తెలిపింది. ఎఐ వినియోగానికి సంబంధించిన సమర్థవంతమైన మొత్తం ఖర్చులు 30 శాతం పెరిగితే, ప్రపంచవ్యాప్తంగా యేటా లభించగల ఆర్థిక ప్రయోజనాల్లో 850 బిలియన్ డాలర్ల మేర తగ్గుదల సంభవించవచ్చని మెకిన్సే అంచనా వేసింది.

దీంతో ఎఐ ద్వారా లభించే అవకాశం ఉన్న ఆర్థిక విలువ 2.52 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.67 ట్రిలియన్ డాలర్లకు పడిపోవచ్చని తెలిపింది. అమెరికా విషయానికి వస్తే యేటా లభించే ఆర్థిక విలువ 960 బిలియన్ డాలర్ల నుంచి 640 బిలియన్ డాలర్లకు తగ్గవచ్చని నివేదిక పేర్కొంది. 2030 నాటికి ఎఐ మౌలిక సదుపాయాలపై సుమారు 7 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని మెకిన్సే అంచనా వేసింది. ఈ పెట్టుబడులను సమర్థించేందుకు యేటా సుమారు 760 బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జించే అవకాశాలు అవసరమని పేర్కొంది. ఎఐ ద్వారా అత్యధిక వార్షిక ఆర్థిక ప్రయోజనాలు పొందగల రంగంగా ఆర్థిక సేవల రంగం నిలిచింది. ఈ రంగంలో సుమారు 530 బిలియన్ డాలర్ల విలువ సృష్టించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది.

విద్యారంగంలో 410 బిలియన్ డాలర్లు, సాంకేతికత, మీడియా, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో 360 బిలియన్ డాలర్లు, ఆరోగ్య సంరక్షణ రంగంలో 310 బిలియన్ డాలర్ల మేర వార్షిక ఆర్థిక ప్రయోజనాలు లభించవచ్చని తెలిపింది. న్యాయ సేవలు, ఆరోగ్య సంరక్షణ, నిర్వహణ, కంప్యూటర్ సంబంధిత వృత్తుల్లో ఎఐని ఖర్చుకు తగిన ప్రయోజనాలతో వినియోగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనిపేర్కొంది. మొత్తంగా, ఎఐ ద్వారా భారీ ఆర్థిక ప్రయోజనాలను సాధించే అవకాశం ఉన్నప్పటికీ, సరైన ప్రణాళిక, వ్యయ నియంత్రణ, ఉత్పాదకత అంచనాలు లేకపోతే ఆశించిన ఫలితాలను పొందడం కష్టమవుతుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.

26-10Pg9th thera.qxd:26-10Pg9th thera.qxd 1/1/02 6:20 AM Page 1



# విను... ఆలోచించు !



మన పని మనం చేసుకు పోదాం. చాలామంది ఉద్యోగినుల ధోరణి అలాగే ఉంటుంది. అనవసర వివాదాల్లో దూరతామేమో అన్న భయం ఒకటే. పని ముగించుకుంటే త్వరగా బయటపడొచ్చు అన్న ఆలోచన మరొకటిందా. సందేహం అడిగితే ఏమీ తెలియదు అనుకుంటారు. ప్రశ్నిస్తే పొగరుగా బావిస్తారు ఇలా లోలోపలే బోలెడు ఊహించుకుంటారు. కానీ ఈ తీరే వారిని ఎదగకుండా ఆపుతుంది. మీదీ అనే వరస్సైతే బ్రాండింగ్ తప్పనిసరి అంటే మేకోవర్. దుస్తుల్నీ, హెయిర్స్టైలో మార్చమని కాదు... మీ పూర్తి ఇమేజింగ్ మార్చుకోమని అర్థం. అడగండి... ప్రమోషన్ కానీ, పైనాళ్ల మెచ్చుకోలు కానీ రానప్పుడు నిరాశ సహజమే కానీ ఎందుకు రావట్లేదు. అన్న ప్రశ్న వేసుకోండి. అయితే దీనికి మాత్రం మీరే సమాధానం ఇవ్వవద్దు. ఎందుకంటే.. ఫలానా అమ్మాయి నా గురించి చెడుగా చెప్పిందేమో, నేనెక్కడ ఎదిగి పోతానో అని వల్ల ఇలా మనమంటే పడనివారి మీదకే దృష్టి వెళ్తుందట. వాటివల్ల ప్రయోజనం లేకపోగా వర్ణం అందుకే మీ పనితీరు తెలిసినవారిని అడగండి వాళ్లైతే మీ లోపాలు కచ్చితంగా చెబుతారు. ఉద్యోగి ఇలాగే చేస్తే ఆమెకేం సలహాలొచ్చాయో తెలుసా! పని చేస్తావు కానీ... అభిప్రాయాలు చెప్పవు ఎప్పుడూ దీనంగా ముఖం పెట్టుకుని ఉంటావు... దీనితో నీతో పని చేయాలని పించదు. వ్యక్తిగత శుభ్రత పాటించు... అంటూ సలహా లొచ్చాయట. అసలీ కోణాలూ మనపై ప్రభావం చూపు ఊహించ గలమా? కొన్ని సార్లు చిన్న అంశాలూ పెద్ద సమస్య అవుతాయనడా నికి ఇది ఉదాహరణ కాబట్టి, ఏ మార్పు అవసరమో అడిగి తెలుసుకోండి. చెప్పినవన్నీ మార్చుకోవాలనేం లేదు. కానీ కొన్నింటినైనా ప్రయత్నించొచ్చు. అప్పు డు నెమ్మదిగా మీలో మార్పు మొదలవు తుంది. చుట్టుపక్కల వాళ్లూ దాన్ని గమని స్తారు. ఒక పరిశోధన ప్రకారం... ఒక పదిని అక్క మగ ఇద్దరూ చేస్తున్నప్పుడు... ఆడవాళ్ల నుంచేఎక్కువ ఫలితం ఆశిస్తారట. మీ సాయి వాళ్లూ అలాగే ఆలోచిస్తుండొచ్చు. కాబట్టి, వాళ్లతోనూ మాట్లాడండి మీ నుంచి ఏమేం ఆశిస్తున్నారో తెలుసుకోండి అయితే వాటిలో సాధ్యా సాధ్యాలు మనిషివి అప్పుడే చెప్పండి. మనకి ఇంటి బాధ్యతలు అదనం. వాటిని గుర్తు చేస్తే ఈ ఆశించడం తగ్గుతుంది అయితే ఒక్కసారి మాట్లాడి ఇబ్బందులన్నీ చెప్పడంతో సమస్య తీరుతుంది. ఎవరికి లేదు. సాధన చేయాలి. నో చెప్పాలి అదంతా నిరంతర ప్రక్రియ, అయితే ఎవరినో అనుసరించొద్దు, అనుకరించొద్దు. గంగలా మాట్లాడలేరా అయితే ఎదుటివారు చెప్పేది వినండి. మీటింగుల్లో కదిలంచ నవసరం లేదు..కానీ,అవసరమైన సందేహాలు అడగొచ్చు.

# కరివేపాక్!

కూరల్లో కరివేపాకు కనిపించగానే.. పక్కన పడేస్తుంటారు. కానీ, అనేక ఔషధ గుణాలున్న కరివేపాకు.. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెడుతుంది. ఆయుర్వేదంలోనూ విరివిగా ఉపయోగపడు తుంది. అయితే.. అందాన్ని మెరుగుపరచడం లోనూ కరివేపాకు ముందుంటుంది. కరివేపాకు ఫేస్ ప్యాక్..మచ్చలేని, కాంతిమంత మైన చర్మాన్ని అందిస్తుంది. కరివేపాకులో యాంటి ఆక్సి డెంట్లు, యాంటి



ఇన్ఫ్లమేటరీ లక్షణాలు, యాంటి మైక్రో బయల్ వంటి గుణాలు పుష్కలం. ఇవి చర్మ ఆరోగ్యా నికి ఎంతో మేలు చేస్తాయని నిపుణు లు చెబుతు న్నారు. చర్మాన్ని మెరి సేలా చేయడంలోనూ సాయపడ˘తాయి. కరివేపాకు లో ఉండే ఔషధ గుణాలు.. చర్మానికి తేమను అంది స్తాయి కూడా! కొన్ని కరివేపాకు లను నీటిలో వేసి ఉడక బెట్టాలి. చల్లా రాక.. మిక్సీలో వేసి పేస్ట్లా గ్రైండ్ చేసు కోవాలి. ఈ పేస్ట్కు తేనె కలిపి.. ముఖం, మెడ, చేతులకు ప్యాక్లా రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే.. ముఖంపై మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. వారంలో రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే.. ముఖం ప్రకాశ వంతంగా తయారవుతుంది. కరివేపాకు పేస్ట్లో రెండుమూడు నిమ్మరసం చుక్కలు వేసి.. ముఖానికి ఫేస్ ప్యాక్లా వేసుకోవాలి. ఆరిన తర్వాత ముఖాన్ని కడిగేసుకుంటే.. చర్మం కాంతిమంతంగా మారుతుంది. కరివేపాకు పేస్ట్కు, కొద్దిగా పాలు కలిపిముఖానికి ప్యాక్ వేసుకున్నా.. మచ్చలు, ముడతలు తగ్గుతాయి.

# నిత్యయౌవన రహస్యం



ఆరోగ్య కరమైన డైట్ అయినా వయసును తగ్గిస్తుంది. ఆహారం కంటే సమతుల్య భోజనమే ముఖ్యమని స్పష్టంవయసు పెరుగుదలను నియంత్రించి, యవ్వనంగా కనిపించడం కోసం చాలామంది రకరకాల డైట్లను అనుసరిస్తుంటారు. అయితే, ఏదో ఒక ఖిమ్యాజిక్ డైట్ఖి పాటించడం కంటే, స్థిరంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కొనసాగించడమే కీలకమని ఓ తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. 'నేచర్ కమ్యూ నికేషన్స్' జర్నల్లో ప్రచురితమైన ఈ పరిశోధన, వృద్ధాప్య వేగాన్ని తగ్గించడంలో ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను శాస్త్రీయంగా వివరించింది.జర్మన్ సెంటర్ ఫర్ న్యూరోడీజన˘రేటివ్ డిసీజెస్ జర్మన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ న్యూట్రిషన్, మరియు బాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. వారు సుమారు 7,500 మంది వయోజనుల ఆహారపు అలవాట్లను, రక్త నమూనా లను విశ్లేషించారు. ఇందులో కాలక్రమేణా వచ్చే వయసు కాకుండా, శరీరం లోపల కణాల స్థాయిలో జరిగే వృద్ధాప్య ప్రక్రియను సూచించే "జీవ సంబంధ వయసు'ను కొలిచారు. ఇందుకోసం డీఎన్ఏపై ఉండే రసాయన మార్పులను గుర్తించే 'ఎపిజెనెటిక్ క్లాక్స్' అనే అధునా తన పద్ధతిని ఉపయోగించారు.ఏ డైట్ పాటిం చినా ఫలితం ఒక్కటేపరిశోధకులు సుమారు 10 రకాల ప్రసిద్ధ ఆరోగ్యకర మైన ఆహార పద్ధతులను విశ్లేషిం చారు. వీటిలో మధ్యధరా డైట్, నార్డిక్ డైట్, మొక్కల ఆధారిత డైట్లు అధిక రక్తపోటును నియంత్రించే డాష్ డైట్, మెదడు ఆరోగ్యం కోసం రూపొందించిన మైండ్ డైట్ వంటివి ఉన్నాయి. ఆశ్చర్యకరంగా, ఈ పద్ధతుల్లో ఏ ఒక్కదానికో కట్టుబడిన వారందరి లోనూ జీవసంబంధ వృద్ధాప్య వేగం నెమ్మదించి నట్లు గుర్తించారు.అంటే, ఫలానా డైట్ మాత్రమే గొప్పదని చెప్పలేమని, ఏ రకమైన ఆరోగ్యకరమైన ఆహార పద్ధతిని స్థిరంగా పాటించినా సానుకూల ఫలితాలు ఉంటాయని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ డైట్లన్నీ వేర్వేరుగా కనిపించినప్పటికీ, శరీరంపై అవి చూపించే ప్రభా వంలో 70 శాతానికి పైగా సారూప్యత ఉన్నట్లు కనుగొన్నారు. ఇవన్నీ కణాల జీవక్రియ, నిర్మాణం, కమ్యూనికేషన్ వంటి కీలకమైన ప్రక్రియ లను మెరుగుపరుస్తున్నట్లు తేలింది.ధూమపానం చేసేవారిలో ఆసక్తికర ఫలితంఈ అధ్యయనంలో మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆరోగ్యకరమైన ఆహారం, జీవసంబంధ వయసు తగ్గడానికి మధ్య ఉన్న సంబంధం ధూమపానం చేసేవారిలో మరింత బలంగా కనిపించింది. మొత్తంమీద ఈ అధ్యయనం ఇచ్చే సందేశం ఒక్కటే. ఖరీదైన, దిగుమతి చేసుకున్న ఫుడ్స్ లేదా కఠినమైన డైట్ల వెంట పడాల్సిన అవసరం లేదు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, తృణధాన్యాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తమ బడ్జెట్, సంస్కృతికి అనుగుణంగా ఎంచుకుని, స్థిరంగా పాటిస్తే చాలు... జీవ గడియారాన్ని నెమ్మదిగా కదిలేలా చేయవచ్చని ఈ పరిశోధన భరోసా ఇస్తోంది. అయితే, ఇది కేవలం పరిశీలనాత్మక అధ్యయనం మాత్రమేనని, ఆహార మార్పులే వయసు వేగాన్ని తగ్గిస్తాయని కచ్చితంగా నిర్ధారించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

# అష్టకష్టాలంటే ఇవే ..

జీవితంలో కష్టాలనేవి ఒకదాని తరువాత ఒకటిగా వచ్చిపడుతుంటాయి. అలాంటప్పుడు వాటిని తట్టుకుంటూనే ముందుకు వెళుతుండటం చేస్తుంటాం. ఇక ఒక్కోసారి కష్టాలన్నీ ఒకేసారిగా వచ్చి మీదపడుతుంటాయి. అలాంటప్పుడు వాటిని ఎదిరించి నిలవడం మరింత కష్టమవుతుంది. కష్టాలనేవి సహనాన్ని పరీక్షి స్తూ కుదిపేస్తూ ఉంటాయి .. జీవితంపై నిరాశా నిస్పృ హాలను కలిగిస్తూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఎవరైనా పలకరిస్తే, అష్టకష్టాలు పడుతున్నాం అని అంటూ ఉంటాం. అష్టకష్టాలనేవి ఏమిటో తెలియకుండానే ఈ మాటను అనేస్తూ ఉండటం జరుగుతుంటుంది. అష్టకష్టాలు అంటే ఎనిమిది రకాల కష్టాలు. ఈ ఎనిమిది రకాల కష్టాలను ఏక కాలంలో అనుభవించే పరిస్థితులు కూడా వచ్చేస్తూ ఉంటాయి. అప్పులపాలు కావడం .. ఇతరు లను యాచించవలసి రావడం .. పేదరికం అనుభవిస్తూ ఉండటం .. ఎంగిలి అన్నం తినవలసి రావడం .. దొంగతనం చేయ వలసి రావడం .. రోగంతో యాతన పడుతుండటం .. వృద్ధా ప్యం .. భార్యా వియోగంతో బాధపడుతూ ఉండటం అష్టకష్టాలుగా చెప్పబడుతున్నాయి. ఎంతటి కష్టమైనా భగవంతుడి అనుగ్రహంతో తీరిపోతుంది .. అందుకు అనునిత్యం ఇష్టదేవతారాధన చేయవలసి ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.

# మలబద్ధకం తగ్గాలంటే..



పిల్లల్లో శారీరక శ్రమ బాగా తగ్గిపోయింది. ఎంతసేపూ కదలకుండా ఒకే చోట కూర్చోవడం, గంటల తరబడి గ్యాడ్జెట్లకు అతుక్కుపోవడం వల్ల స్థూలకాయం వంటి సమస్యలే కాదు. మలబద్ధకం కూడా వచ్చే ప్రమాదం ఉందంటు న్నారు నిపుణులు. ప్రస్తుతం చాలామంది చిన్నారుల్లో తలెత్తే ఈ సమస్యకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం.. పిల్లల్లో మలబద్ధకం సమస్య రావడానికి కొన్ని కారణాలంటున్నారు నిపుణులు శారీరక శ్రమ లేకపోవడం/ ఆటలాడక పోవడం/ ఎక్కువసేపు కదలకుండా ఒకే చోటు కూర్చోవడం.. నీళ్లు సరిగ్గా తాగకపోవడం, ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం.. జంక్ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం రాత్రిపూట ఆలస్యంగా తినడం. అర్ధరాత్రి వరకు మేల్కోవడం. నిద్రలేమి. 6.జీవక్రియల పనితీరు మందగించడం.

ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు పిల్లలతో తాగించాలి. రుచి కోసం టీస్పూన్ తేనె, నిమ్మరసం కూడా కలిపి అందించవచ్చు. రాత్రి నీటిలో నానబెట్టిన 45 ఎండు ద్రాక్షలను పరగడుపునే తినిపించాలి. ఇంగువను పేస్ట్గా తయారు చేసుకుని పిల్లల బొడ్డు చుట్టూ సవ్యదిశలో రాయాలి. దీనివల్ల వారిలో అజీర్తి సమస్యలేవైనా ఉంటే దూరమవుతాయ! పచ్చి ఆహార పదార్థాలను పిల్లలు జీర్ణం చేసుకోలేరు. కాబట్టి వారికి ఉడకబెట్టిన, వండిన ఆహార పదార్థాలను అందించాలి. 6. పిల్లలకు అందించే ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, నూనెల మోతాదును బాగా తగ్గించాలి. 7.పిల్లలతో వివిధ రకాల వ్యాయామాలు చేయడంతో పాటు ఆటలాడేలా వారిని ప్రోత్సహించాలి. నడక, పరుగు, జాగింగ్.. వంటివీ మంచివే 8.అయితే ఈ చిట్కాలు పాటిస్తున్న పిల్లల్లో మలబద్ధకం సమస్య తగ్గుముఖం పట్టకపోతే.. పిల్లల వైద్య నిపుణులను సంప్రదించి వారికి తగిన చికిత్స అందించడం మంచిది.

# తెర



## 27న అలియాస్ రుక్మిణి ఫస్ట్ సింగిల్

బ్లాక్బస్టర్ సక్సెస్ కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్తో రాబోతోంది. ఖిఅలియాస్ రుక్మిణి అనే టైటిల్తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, దండోరా ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న అలియాస్ రుక్మిణి ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్గా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిసు ట్ట న్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్కు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి పెరిగిం ది.ఇప్పుడు మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ను కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ రుక్కురుక్కు రుక్మిణి పాటను అక్టోబర్ 27న విడుదల చేయనున్నారు.ఈ చిత్రం డిసెంబర్ 4న విడుదల కానుంది.

## ఆకాశంలో ఒక తార రుహానీ శర్మ ఫస్ట్ లుక్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా ఆకాశంలో ఒక తార గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో ముఖ్య మైన పాత్రను మేకర్స్ పరిచయం చేశారు.ఈ సినిమాలో బిజిలీగా నటిస్తున్న రుహానీ శర్మ ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేశారు. కిటికీ పక్కన కూర్చుని కనిపిస్తున్న ఆమె సంప్రదాయ దుస్తుల్లో సింపుల్గా, అందంగా ఆకట్టుకున్నారు.బిజిలీ పాత్ర సినిమాలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందనే ఆసక్తిని ఈ ఫస్ట్ లుక్ పెంచుతోంది.2026 నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## 418కి ఎక్స్ట్రార్డినరీ రెస్పాన్స్



మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ 418 సినిమాకు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నిన్నటి కంటే ఈరోజు చాలా బాగుంది. మేము చేసిన ఫస్ట్ హారర్ సినిమా ఇది. మా బ్యాన ర్కు ఇంత మంచి సినిమా చేసి పెట్టిన డైరెక్టర్ కీర్తన్కు థాంక్యూ. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ..కీర్తన్ ఎక్స్ట్రార్డినరీ స్టోరీ రాసి, సిని మాను అద్భుతంగా చేశాడు. సౌండ్ డిజైన్, మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా బాగుందని అందరూ అంటున్నా రు. అదే సమయంలో సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తు న్నారు. టెక్నికల్గా సినిమా అద్భుతం. ప్రకీర్తన్ యంగ్ టీమ్ను సెలెక్ట్ చేసుకుని సినిమాను చాలా పెద్ద సక్సెస్ చేశాడు. మైత్రీ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రీమియర్స్ నుంచే ఈ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా సౌండ్ గురించి ఆడియన్స్ గొప్పగా మాట్లాడుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో తెలుగులో ఇలాంటి హారర్ సినిమా నేను చూడలేదు. డైరెక్టర్ కీర్తన్ నాదగౌడ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాతలు నవీన్ గారు, రవి గారికి థాంక్స్. ప్రశాంత్ నీల్ గారు చాలా ప్రోత్సహించారు.

## విశ్వదేవ్ హీరోగా ప్రొడక్షన్ నెం.1 సినిమా అనౌన్స్ మెంట్



"35 చిన్న కథ కాదు" సినిమా ఫేమ్ విశ్వదేవ్ హీరోగా మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ సినిమా శ్రీ తులసి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా రాబోతోంది. "ముఖచిత్రం" సినిమా ఫేమ్ దర్శకుడు గంగాధర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో నర్సి రాజగిరి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్ కు పరిచయమవుతున్నారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్ మెంట్ చేశారు. ఒక కొత్త తరహా కాన్సెప్ట్ తో న్యూ టాలెంటెడ్ డైరెక్టర్ నర్సి రాజగిరి ఈ సినిమాను రూపొందించే ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. "ముఖచిత్రం" వంటి వైవిధ్యమైన సినిమాను తెరకెక్కించిన దర్శకుడు గంగాధర్ ఈ సినిమాతో నిర్మాతగా మారుతుండటం విశేషం. ముఖచిత్రం సినిమా దర్శకుడిగా గంగాధర్ కు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ సినిమాతో ఆయన అందరి ప్రశంసలు పొందారు.



## డార్క్ చాక్లెట్ సినిమా ట్రైలర్ లాంచ్

రానా దగ్గుబాటి ప్రెజెంట్స్, విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి, శశాంక్ శ్రీవాస్తవయ, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ స్పిరిట్ మీడియా డార్క్ చాక్లెట్ ట్రైలర్ లాంచ్ హీరో విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ..ప్రతి మనిషిలో ఒక డ్యూయాలిటీ ఉంటుంది. అది ఈ సినిమా చూసినప్పు డు మిర్రర్ రిఫ్లెక్షన్స్లా మీకు కనిపిస్తుంది. ఇది నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్లాంటి సినిమా. ఇలాంటి సినిమా ఇంతకుముందు ఎప్పుడూ రాలేదు. ఏ భాషలో వచ్చిన సినిమాతోనూ దీనిని కంపేర్ చేయలేరు. బిందు మాధవి మాట్లాడుతూ..బిగ్ స్క్రీన్ మీద ట్రైలర్ చూస్తుంటే చాలా హ్యాపీగా అనిపించింది. చాలా అద్భుతంగా ఉంది. ఇది రెగ్యులర్ ఫార్మా ట్లో ఉండే సినిమా కాదు. చాలా డిఫరెంట్గా ఉంటుంది. రాకేష్ రాచకొండ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నేను చేసిన పాత్ర ఒక నటుడిగా నాకు చాలా సంతృప్తినిచ్చింది.

## నవంబర్ 13న రోమియో జూలియట్



హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న రోమియో జూలియట్ట్ సినిమా థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో హర్షిత్ మాట్లాడుతూ.. దివాన సినిమాకి అందరూ సపోర్ట్ చేశారు. రోమియో జూలియట్ట్కు మీ సపోర్ట్ కావాలని కోరుతున్నాను. మా సినిమా గ్లింప్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా ప్రభాస్ గారికి ధన్యవాదాలు. ఆయ న ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేయడం మా అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డైరెక్టర్ భార్గవ్ మాచర్ల మాట్లాడుతూ.. ఇది అందరి బయోపిక్. మనందరి జీవితంలో ఎక్కడో ఒకచోట కనెక్ట్ అయ్యే ఎమోషన్ను తీసుకుని సినిమాగా చేయడం జరిగింది. ఇది హిలేరియస్ ఫన్ రైడ్లా ఉంటుంది. ఈటీవీ విన్ వైస్ ప్రెసిడెంట్ సాయికృష్ణ మాట్లాడుతూ.. మేము నిర్మించని సినిమా కాకుండా బయట సినిమాని ఫస్ట్ టైం ప్రజెంట్ చేస్తున్నాం . ఇది మాకు చాలా స్పెషల్. అలాగే మయూరి మూవీస్ ద్వారా ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నాం. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ.. ఇది ప్రస్తుత జనరేషన్పై మంచి హిలేరియస్ సినిమా. లవ్ టుడే లాంటి ఎంటర్టైనర్. నవంబర్ 13న తప్పకుండా మీరంతా ఎంజాయ్ చేస్తారు.

## ఫీల్ గుడ్ సినిమా నుంచి సాంగ్ రిలీజ్



టాలీవుడ్లో హాట్ టాపిక్గా అవుతూ తెర కెక్కుతున్న రొమాంటిక్ కామెడీ చిత్రం ఫీల్ గుడ్ నుంచి మమ్మా మియ్యా పూర్తి పాటను చిత్ర బృం దం విడుదల చేసింది. విశ్వరూప ఫిల్మ్స్ బ్యాన ర్పై దయానంద్ కథ, స్క్రీన్ప్లే, దర్శకత్వంలో సుచిత్ నిర్మాణంలో సుచిత్, అదితి త్రిపాఠి జంట గా నటించిన ఈ పాట ఆకట్టుకునే సంగీతం, యువతను ఆకట్టుకునే బాణీ, ఉత్సాహభరితమైన పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయిఈ చిత్రంలో సుచిత్, అదితి త్రిపాఠితో పాటు రవూరి ప్రియాంక, లిఖిత్, రణధీర్ వాసుదేవ్, సైఫాని, దివ్య మోహన్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వర లోనే విడుదల చేయడానికి చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ˘మమ్మా మియ్యా పాట విడుదలతో ఫీల్ గుడ్ట చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతుందని, యూత్ ఆడియన్స్కు కనెక్ట్ చేస్తుందని చిత్ర బృందం ఆశిస్తోంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.